


గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రూప్-1 ఉద్యోగాల వ్యవస్థను సర్వనాశనం చేశారు. అదే టీడీపీ హయాంలో 11 డీఎస్సీలు జరిగితే ఒక్క ఆరోపణ కూడా రాలేదు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి లోకేష్ ఉపాధ్యాయ బదిలీల్లో రాజకీయ ప్రమేయం లేకుండా, యూనివర్సిటీల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాలను రాజకీయాలకు అతీతంగా మెరిట్ ప్రాతిపదికన చేపట్టి విద్యా రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 09.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 48 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# 2027 నాటికి భూ రికార్డులు క్లీన్



- మూడేళ్లలో పూర్తి ప్రక్షాళనకు సీఎం చంద్రబాబు హామీ
- రాజముద్రతో భద్రతా ఫీచర్లున్న కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు
- బ్లాక్‌చెయిన్ ఆధారంగా భూ రికార్డుల సంస్కరణలు
- కరెన్సీ నోట్ల తరహాలో పాస్ పుస్తకాలకు సెక్యూరిటీ ఫీచర్లు
- గత పాలకులపై సీఎం చంద్రబాబు విమర్శలు
- 26.46 లక్షల మందికి ఇప్పటికే కొత్త పాస్ పుస్తకాలు

**ఆచంట(జర్నలిస్ట్ ఫైల్) :** 2027 నాటికి రాష్ట్రంలో భూ రికార్డులను ప్రక్షాళన చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత పాలకులు పశ్చిమ గోదావరి జిల్లా లాంటి పచ్చని ప్రాంతంలోనూ భూ చిచ్చు పెట్టారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. గజం భూమిని కూడా సద్వినియోగం చేసుకునే రైతులనూ గత ప్రభుత్వం వదిలి పెట్టలేదని తీవ్రస్థాయిలో ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో మీ భూమి – మీ హక్కు పేరిట రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. దుర్మార్గమైన గత పాలకుల నిర్వాకంతో రికార్డులన్నీ గందరగోళంగా తయారయ్యాయని ప్రజలకు చెందిన భూముల విషయంలో సమస్యలు సృష్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూ రికార్డులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి యాజమాన్య హక్కుల్ని రక్షించామని వివరించారు. క్యూ ఆర్ కోడ్ సహా కరెన్సీ నోట్ల తరహాలోనే అత్యంత పటిష్టమైన భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు చేసిన అవకతవకల కారణంగా భూమి రికార్డుల ప్రక్షాళనకు 3 ఏళ్ల సమయం పడుతుందని సీఎం అన్నారు. దేశంలోనే తొలిసారి బ్లాక్ చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతీ యూనిట్ కు శాశ్వతమైన బ్లాక్ చైన్ ఐడీలు ఇస్తున్నామని.. దీని ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ చేసేందుకు అవకాశం ఉండదని తెలిపారు. ప్రజల ఆస్తి పత్రాలపై ఫోటోలు ముద్రించుకున్నారని.. పొలం సరిహద్దు రాళ్లపై బొమ్మల కోసం రూ. 800 కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. ప్రస్తుతం భూముల రీసర్వే ప్రక్రియలో రైతులను కూడా భాగస్వాములను చేస్తున్నామని... ఈకేవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూమి

2 లో







# విశాఖ స్టీల్‌లో మృత్యుఘోష

**విశాఖపట్నం (ఉక్కు నగరం):** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్–2, ఎస్‌టీసీ–3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ పేలడంతో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 9 మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1,500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం సంభవించడంతో భయాందోళనకు గురైన కార్మికులు, ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. మృతులు అప్పారావు, ప్రభాకర్‌రావు, కృష్ణ, రమణ, త్రినాథ్, అప్పలరాజు, కుమార్‌గా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. వీరిలో ఐదుగురు విశాఖ స్టీల్ ఉద్యోగులు కాగా.. ముగ్గురు ఒప్పంద కార్మికులని అధికారులు తెలిపారు.

**మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ సంతాపం :** విశాఖ స్టీల్‌ప్లాంట్ దుర్ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాన మంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది. పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ. 2లక్షలు, క్షతగాత్రులకు రూ. 50వేలు అందిస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు.

మిగతా 2లో...





- స్టీల్ ల్యాడిల్ పేలుడుతో 9 మంది దుర్మరణం
- పలువురికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- ప్రధాని, సీఎం దిగ్భ్రాంతి.. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం




# అభిమాని కోరిక తీర్చిన చంద్రబాబు

- వైరల్ వీడియోతో స్పందించిన సీఎం..
- వృద్ధుడిని బస్సులోకి పిలిచి ఆత్మీయంగా పరామర్శ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తనను చూడాలన్న ఓ వృద్ధ అభిమాని కోరికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ చంద్రబాబుకు వీరాభిమాని.

తమ నియోజకవర్గానికి చంద్రబాబు వస్తున్నారని, దూరం నుంచైనా ఆయన్ను చూడాలని సత్యనారాయణ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లింది.

మిగతా 2లో...





# సర్వైకల్ క్యాన్సర్‌పై సర్కార్ కవచం

- 2.71 లక్షల మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలు
- వ్యాక్సినేషన్ గడువు ఆగస్టు వరకు పొడిగింపు

2 లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గర్భాశయ ముఖ ద్వారం (సర్వైకల్ క్యాన్సర్ కేసుల నిరోధానికి చేపట్టిన హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్. పి. వి.) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మూడు నెలల పాటు (ఆగస్టు వరకు) పొడిగించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 2,71,071 మంది బాలికల(78.57%)కు హెచ్‌పివి టీకాలు వేసినట్లు వెల్లడించారు. 14 ఏళ్ల (14వ పుట్టినరోజు పూర్తి చేసుకుని 15వ పుట్టిన రోజులోనికి ఇంకా అడుగుపెట్టని) బాలికలకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి హెచ్ పివి టీకా వేస్తున్నామని తెలిపారు.

## భక్తుల బస్సును ఢీకొట్టిన లారీ



- ముగ్గురు దుర్మరణం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నెల్లూరు జిల్లా నుంచి కాశీ క్షేత్రానికి వెళ్తున్న భక్తుల బస్సు బిహార్ లో ఘోర ప్రమాదానికి గురైంది. ఔరంగాబాద్ వద్ద యాత్రికుల బస్సును ఒక లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జిల్లాలోని సంగం, ఆత్మకూరు. దుత్తలూరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు భక్తులు అక్కడికక్కడే మృతి చెందారు.

మిగతా 2లో...

## రాజ్యసభ బరిలో టీడీపీ త్రయం



- సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ నామినేషన్లు
- అమరావతిలో కూటమి నేతల సమక్షంలో దాఖలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరఫున సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. అమరావతి అసెంబ్లీ భవనంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు.

మిగతా 2లో...

## ఇంధనానికి ఢోకా లేదు



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** హోర్ముజ్ జలసంధి మూసి ఉంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని, 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

సోమవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది? దేశీయంగా మనకు తగినన్ని నిల్వలు ఉన్నాయి.

## ఫిలిప్పీన్స్‌ను వణికించిన భూకంపం

- 35కి పెరిగిన మృతులు
- సునామీ హెచ్చరికలు జారీ

2 లో




## టెస్టుల్లో టీమిండియా రికార్డు




- ఆఫ్ఘనిస్తాన్‌పై ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో గెలుపు
- మూడ్రోజుల్లోనే ముగిసిన ఏకైక టెస్ట్

2 లో

## భారతీయ అద్భుత వరం యోగా

- వెల్‌నెస్ సెంటర్లతో పర్యాటక రంగానికి కొత్త ఊపు
- యోగాంధ్ర కార్యక్రమంలో మంత్రి దుర్గేష్

3 లో

**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్) :** భారతదేశానికి అనాదిగా లభించిన గొప్ప వరం యోగా అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.'యోగాంధ్ర – 2026' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ప్రత్యేక యోగా




# గోదావరిని ఇలా వదిలేస్తారా?

- కాలుష్యంపై అధికారులను నిలదీసిన పవన్ కళ్యాణ్
- ఆంధ్ర పేపర్ మిల్లు, మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులు

2 లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పవిత్ర గోదావరి నదిని పారిశ్రామిక రసాయనాలు, నగర మురుగు నీరు ఎంత దారుణంగా కలుషితం చేస్తున్నాయో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులు అందించిన ల్యాబ్ రిపోర్టులో వెలుగులోకి వచ్చింది. గత నెల మే 25న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా బోటుపై వెళ్లి నల్లా ఛానల్, ఆంధ్ర పేపర్ మిల్లు లగూన్స్ (మడుగులు) వద్ద సేకరింపజేసిన నీటి నమూనాల పరీక్షా ఫలితాలు దిగ్భ్రాంతి కలిగించాయి. అత్యాధునిక సాంకేతికతతో నిర్వహించిన ఈ పరీక్షల్లో అనుమతించదగిన పరిమితుల కంటే



కాలుష్య కారకాలు అధికంగా ఉన్నట్లు తేలింది.

ఈ నివేదికపై పవన్ కళ్యాణ్ తూర్పుగోదావరి జిల్లా ఉన్నతాధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సోమవారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. గోదావరి నదిని మురుగుమయం,

మిగతా 2లో...

# విశాఖ స్టీల్‌లో మృత్యుఘోష

(మొదటి పేజీ తరువాయి)

**ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడారు. పలువురు కార్మికులు చనిపోవడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితి, సహాయ చర్యలను ముఖ్యమంత్రికి స్టీల్ ప్లాంట్ అధికారులు వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో సహాయ చర్యలు చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదంపై కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆరా తీశారు. ఈ ఘటన జరగడం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. లాడిల్‌లో ఉక్కుద్రవం తరలిస్తుండగా పేలుడు జరిగిందని తెలుస్తుందని చెప్పారు. ప్రమాదం ఎలా జరిగిందో ఇప్పుడే స్పష్టంగా చెప్పలేమన్నారు. ఘటనాస్థలానికి వెళ్లి సహాయ చర్యలు పర్యవేక్షిస్తానని వివరించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కేంద్రమంత్రి కుమారస్వామి ఆరా తీశారని చెప్పారు. ఈ ఘటన ఎందుకు జరిగిందో దర్యాప్తులో తెలుస్తుందన్నారు. ఇలాంటి సమయంలో ఆరోపణలు, విమర్శలు సరికాదని భూపతిరాజు శ్రీనివాసవర్మ వ్యాఖ్యానించారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో కార్మికులు మృతిచెందడం తీరని విషాదమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం క్షతగాత్రులకు వైద్యం, ప్రమాద స్థలంలో సహాయకచర్యలను పర్యవేక్షిస్తోందని ఎక్స్ వేదికగా లోకేశ్ ట్వీట్ చేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదంపై మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అచ్చెన్నాయుడు, డీఎస్‌బీవీ స్వామి, వాసంశెట్టి సుభాష్ అధికారులతో మాట్లాడారు. సహాయ చర్యలపై టీజీ భరత్, కొండపల్లి, గొట్టిపాటి రవి ఆరా తీశారు. ఈ ఘటనపై సత్యకుమార్, సంధ్యారాణి, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, టీజీ భరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ విచారం వ్యక్తంచేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదానికి ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని కార్మిక సంఘం నేతలు ఆరోపించారు. ఉక్కుద్రవం లీకై 9 మంది కార్మికులు మృతిచెందడం బాధాకరమన్నారు. 30 ఏళ్ల నాటి పాత యంత్రాలు మార్చకుండా ఉపయోగించడం వల్లే ఈ దుర్ఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు.

# అభిమాని కోరిక తీర్చిన చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై స్పందించిన సీఎం.. సిద్దాంతంలో కలుద్దామని సత్యనారాయణకు తెలియజేశారు.

సోమవారం 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్దాంతం వెళ్లిన చంద్రబాబు, కార్యక్రమం అనంతరం తన బస్సులోకి సత్యనారాయణను ప్రత్యేకంగా పిలిపించుకుని ఆత్మీయంగా మాట్లాడారు. కుటుంబ వివరాలు, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

తన కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని, వైద్య సహాయం అందించాలని సత్యనారాయణ కోరగా, వైద్యం చేయిస్తానని సీఎం భరోసా ఇచ్చారు. తమ గ్రామంలో డ్రైనేజీ సదుపాయం కల్పించాలని చేసిన విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబు, సత్యనారాయణకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

# భక్తుల బస్సునుఢీకొట్టిన లారీ

(మొదటి పేజీ తరువాయి)

మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లిన తమ వారు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో బాధితుల స్వగ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 43 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో సంగం గ్రామానికి చెందిన చౌడం హజరత్తయ్య (60) ఉన్నారు. అలాగే నెల్లూరు మిలటరీ కాలనీ, దర్గా మిట్ట ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్, ఈ యాత్రకు ఆర్గనైజర్ వ్యవ హరించిన పసుపులేటి వెంకటేశ్వర్లు (63) ఉన్నారు. వీరితో పాటు ఆత్మకూరు వీవర్స్ కాలనీకి చెందిన తూమా పద్మావతి (43) అనే మహిళ కూడా మృతి చెందారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుప త్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి సహాయకచర్యలు చేపట్టారు.

# రాజ్యసభ బరిలో టీడీపీ త్రయం


(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో కూటమి పార్టీల నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. సానా సతీష్ రెండు సెట్ల నామినేషన్లు సమర్పించగా, ప్రతిపాదకులుగా చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), తంగిరాల సౌమ్య సంతకాలు చేశారు.

బాష్యం రామకృష్ణ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, ప్రతిపాదకులుగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బి. రామాంజనేయులు, కొలిశెట్టి శ్రీనివాస్, శ్రీరాం తాతయ్య సంతకాలు చేశారు. చింతకాయల విజయ్ కూడా రెండు సెట్ల నామినేషన్లు సమర్పించగా, ప్రతిపాదకులుగా మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుందరపు విజయ్ కుమార్, బోడే ప్రసాద్ సంతకాలు చేశారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం. అఖిల్ కుమార్, పి. విజయ కుమారితో పాటు కూటమి నేతలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), వరుపుల సత్యప్రభ, బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు. 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ కూడా హాజరయ్యారు.

# ఇంధనానికి ఢోకా లేదు



(మొదటి పేజీ తరువాయి)

60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచురల్ గ్యాస్, ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అన్నారు.

పశ్చిమాసియాలో పరిస్థితి రెండు, మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు. యూఏఈ వంటి మంచి మిత్రులు మనకున్నారని, ఎల్పీజీ కార్గోలను నేరుగా మనకు పంపగలమని యూఏఈ నుంచి ప్రతిపాదన ఉందని, పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి దేశీయంగా స్ట్రాటజిక్ పెట్రోలియం సహా 30 నుంచి 60 రోజులకు సరిపడా అన్నిరకాల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 76నుంచి 80రోజులకు కూడా సరిపోవచ్చున్నారు.

# 2027 నాటికి భూ రికార్డులు క్లీన్



(మొదటి పేజీ తరువాయి)

రికార్డులను అప్డేట్ చేశామని అన్నారు. 26.46 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో ప్రతీ రైతు వద్దా తప్పుల్లేని పాస్ పుస్తకం ఉంటుందని అన్నారు.

**రెవెన్యూ శాఖలో సమూల మార్పులు :** రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని... రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని సీఎం వివరించారు. విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామని తెలిపారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశామని... రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామని స్పష్టం చేశారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ చేపట్టామని అన్నారు. 80 శాతం ఈ-కేవైసీ పూర్తయిన తర్వాతే గ్రామాలను వెబ్ ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామని అన్నారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రాష్ట్రంలోని 1.37 లక్షల ఎకాల విలేజ్ సర్వీసు ఇనామ్ భూములను 22 ఏ నుంచి తప్పించామని తెలిపారు. తిరుపతి జిల్లాలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామ భూములను పరిష్కరించి వారికి అప్పగించామన్నారు. అక్వా రైతులకు అండగా నిలబడ్డామని సీఎం స్పష్టం చేశారు. గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో పాటు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరిచారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. అక్వా ఫీడ్ రేట్లు పెరగడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని రాయితీలు ఇవ్వాలని సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరామన్నారు. పశ్చిమ గోదావరి లాంటి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి పెట్టామని సీఎం వివరించారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలు కాలుష్య సమస్యగా మారకుండా న్యూట్రాసిటికల్ ఔషధాల తయారు చేసుకునే అవకాశం ఉందన్నారు.

**రెండేళ్లుగా సమపాళ్లలో సంక్షేమం- అభివృద్ధి :** కూటమి ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నామని సంక్షేమం- అభివృద్ధి-సుపరిపాలన అందిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా తిరుపతి, అమరావతి, విశాఖలో మూడు ప్రాంతాల్లో మూడు సభలు నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధిని ట్రాక్ లో పెట్టామని .. పెట్టుబడులు ఉద్యోగాల కల్పన జరుగుతోందని అన్నారు. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం అని వివరించారు. సూపర్‌సిక్స్‌లో చెప్పినవాటికంటే అదనంగా ఇచ్చామని తెలిపారు. పెన్షన్, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్లు, మత్స్యకారులు ఇలా అందరికీ సంక్షేమం అందిస్తున్నామని వివరించారు.

**గొడ్డలి పార్టీది ఓర్వలేనితనం:** డీఎస్సీ ద్వారా దాదాపుగా 16 వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని.. పరీక్షలు అంటే తెలీని వ్యక్తులు, రిజర్వేషన్ల గురించి అవగాహన లేని వాళ్లు బురద జల్లే ప్రయత్నం చేస్న?న్నారని సీఎం ఆరోపించారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని దగా చేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చాకే ఉద్యోగాలు ఇచ్చి జాబ్‌కేలండర్ విడుదల చేశామన్నారు. దీన్ని చూసి ఓర్వలేకే నేరాలు ఘోరాలు చేసి ఎదుటివారిపై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. గొడ్డలి పార్టీ చరిత్ర రాష్ట్రంలో అందరికీ తెలుసని... నేరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేస్తుందని ఆక్షేపించారు. చేసిన ప్రతీ ఆరోపణకూ మంత్రులు అధికారులు పూర్తిగా వివరణ ఇచ్చారని.. దీనికి ఆ వైపు నుంచి సమాధానం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత ఆ పార్టీకి లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులను గొడ్డలి పార్టీ నేతలు క్షమాపణలు కోరాలన్నారు. ప్రజల్ని క్షమాపణ కోరకుండా రాష్ట్రంలో రాజకీయాలు చేసేందుకు గొడ్డలి పార్టీకి అర్హత లేదన్నారు. ప్రజలకు రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నందుకు తాను సంతోషిస్తున్నానని.. కానీ వైసీపీ పార్టీ నేతలు రాష్ట్రంలో భూ కబ్జాలు చేశారని రికార్డులు తారుమారు చేశారన్నారు. తెలంగాణా రాష్ట్రానికి వెళ్లి అక్కడి ఎమ్మార్వో, జేసీ సంతకాలు ఫోర్జరీ చేసి రికార్డులు తారుమారు చేశారన్నారు. ఈ నేరంలో రూ.1500 కోట్ల అక్రమాలు జరిగాయన్నారు. ఇంత నేరం జరిగితే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు.. వినుకొండ మాజీ ఎమ్మెల్యేను ఎందుకు సస్పెండ్ చేయలేదని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకు రారని.. కోడి కత్తి డ్రామాలు ఆడేవారికి వరికోతలు ఎలా తెలుస్తాయని సీఎం వ్యాఖ్యానించారు. గంజాయి బ్యాచ్‌లను ఓదార్చేవారికి పంటల సాగు ఎలా తెలుస్తుందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలంటే గొడ్డలి పార్టీ వ్యక్తులను దూరంగా పెట్టాలని సీఎం వ్యాఖ్యానించారు.

**అందరి ఆరోగ్యం కోసం యోగాంధ్ర :** అనంతరం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై జిల్లా నివేదికను ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందించే వివిధ పౌరసేవలను మెరుగ్గా అందించటంలో కృషి చేస్తున్న అధికారులను అభినందించారు. ఆగస్టు 15 లోగానే రాష్ట్రవ్యాప్తంగా సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానున్నట్టు వివరించారు. ప్రీవెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. జూన్ 21 తేదీన రాష్ట్రంలో కోటి మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 2047 సంపన్నమైన, ఆనందకరమైన ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్ ను తయారు చేయటమే లక్ష్యమని వివరించారు. అనంతరం సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఉత్పత్తి అవుతున్న కోకో ద్వారా తయారైన చాక్లెట్లను, కొబ్బరి, పామాయిల్ ఉత్పత్తుల ప్రదర్శనల్ని పరిశీలించారు. వరి ఊక, గడ్డి ద్వారా తయారైన వివిధ ఉత్పత్తులు, గుర్రపు డెక్కద్వారా తయారైన వర్మీ కంపోస్టును సీఎం పరిశీలించారు. ఆక్వా వ్యర్థాల ద్వారా తయారైన ఉప ఉత్పత్తులను పరిశీలించి తయారీ దారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

# గోదావరిని ఇలా వదిలేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

రసాయనమయం చేస్తున్న ప్రస్తుత పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. కళ్లముందే గోదావరి నది ఇంతలా కలుషితమవుతున్నా ఇన్ని రోజులుగా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఎందుకు కాలయాపన చేశారని ప్రశ్నించారు. అధికారులు చట్టపరంగా చేయాల్సిన విధులను ఎందుకు నిర్వర్తించలేదని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై గతంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు.

**ఆందోళనకర స్థాయిలో కోలిఫామ్ బ్యాక్టీరియా :** భక్తులు ఎంతో పవిత్రంగా భావించే రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్, నల్లా ఛానల్ పరిసరాల్లో గోదావరి నది నీరు మురుగునీటి వల్ల తీవ్రంగా కలుషితమైందని ల్యాబ్ పరీక్షల్లో తేలింది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అధికారులు నీటి నమూనాలను సేకరించి పరీక్షించగా ఆందోళనకరమైన అంశాలు వెలుగుచూశాయి.

సాధారణంగా నది నీటిలో మనుషులు స్నానాలు చేయడానికి కోలిఫామ్ బ్యాక్టీరియా సంఖ్య 500 MPN/100 ml లోపు ఉండాలి. కానీ నల్లా ఛానల్ సమీపంలోని కోటిలింగాల ఘాట్ వద్ద ఇది ఏకంగా 2420 MPN/100 mlకు చేరింది.

నీటిలో కాలుష్యాన్ని సూచించే బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ పరిమితి 3 mg/లీ కంటే తక్కువగా ఉండాలి. అయితే ఇక్కడ అది 5.2 mg/లీగా నమోదైంది. దీంతో నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి చేపలు, ఇతర జలచరాల మనుగడపై ప్రభావం పడుతోంది.

నీటి స్వచ్ఛత సూచిక 5 NTU పాయింట్లలోపు ఉండాల్సి ఉండగా, పరీక్షల్లో 8.4 నుంచి 14.2 NTU వరకు నమోదైంది. మురుగునీరు కలవడం వల్ల గోదావరి నీరు రంగు మారుతున్నట్లు తేలింది.

మురుగు కాలువలో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ పరిమితి 250 mg/L దాటకూడదు. కానీ ఇక్కడ 263 mg/L గా నమోదైంది. నీటిలో నైట్రేట్ పరిమితి 45 mg/L లోపు ఉండాలి. అయితే 119.6 mg/L గా తేలింది. రసాయన ఎరువుల అవశేషాలు, పరిశ్రమల వ్యర్థాలు కలవడం వల్లే నైట్రేట్లు అధికమయ్యాయని అధికారులు గుర్తించారు.

ఈ నీరు స్నానాలకు, గృహ అవసరాలకు అనుకూలం కాదని ల్యాబ్ నివేదిక స్పష్టం చేసింది.



ఈ నీటి వల్ల కలరా, టైఫాయిడ్, విరేచనాలు, చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా చిన్నపిల్లల్లో 'బ్లూ బేబీ సిండ్రోమ్' వచ్చే ముప్పు ఉందని పేర్కొంది.

**పరిమితికి మించి ప్రమాదకర రసాయనాలు :** ఆంధ్ర పేపర్ మిల్లు లగూన్ వద్ద సేకరించిన నీటి నమూనాల పరీక్షల్లో కూడా నివ్వెరపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. నీటిలో సల్ఫైడ్, దూణ, ఫాస్ఫేట్ల స్థాయులు పరిమితికి మించి ఉన్నట్లు తేలింది.

బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ పరిమితి 30 mg/L లోపు ఉండాలి. కానీ ఇక్కడ 36 mg/L గా నమోదైంది. ఫ్యాక్టరీ వ్యర్థాలను సక్రమంగా శుద్ధి చేయకపోవడం వల్ల నీటిలో ఆక్సిజన్ స్థాయులు తగ్గి చేపలు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతున్నాయని నివేదిక పేర్కొంది.

ఫాస్ఫేట్ పరిమితి 5 mg/L ఉండాల్సి ఉండగా 5.3 mg/L గా నమోదైంది. సల్ఫైడ్ పరిమితి 2 mg/L మాత్రమే ఉండాలి. అయితే 3.4 mg/L గా నమోదై 70 శాతం అధికంగా ఉన్నట్లు తేలింది.

ల్యాబ్ నివేదిక ప్రకారం ఫ్యాక్టరీ విడుదల చేస్తున్న వ్యర్థ జలాలు చుట్టుపక్కల ప్రజల ఆరోగ్యాన్ని, మత్స్యకారుల ఉపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ నీటిని శుద్ధి చేయకుండా వినియోగించడం మానవ ఆరోగ్యానికి ముప్పుగా మారుతుందని హెచ్చరించింది.

**తప్పులు సరిచేసుకోవడానికి మరో అవకాశం :** ఆంధ్ర పేపర్ మిల్లు పరిసరాల్లోని లగూన్ వ్యర్థ జలాల ల్యాబ్ నివేదికలో కాలుష్య తీవ్రత స్పష్టంగా నిర్ధారణ అయింది. చట్టప్రకారం ఈ నివేదిక ఆధారంగా ఫ్యాక్టరీని తక్షణమే మూసివేయడానికి, ఉత్పత్తిని నిలిపివేయడానికి, భారీ జరిమానాలు విధించడానికి ప్రభుత్వానికి అధికారాలు ఉన్నాయి. అయినప్పటికీ పరిశ్రమల మనుగడ, కార్మికుల ఉపాధిని దృష్టిలో ఉంచుకుని ఆ పరిశ్రమకు మరో అవకాశం ఇవ్వాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. పరిశ్రమలను మూసివేసి కార్మికులను రోడ్డున పడేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, పర్యావరణ నిబంధనలను పాటిస్తూ గోదావరిని కాపాడటమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

ఆంధ్ర పేపర్ మిల్లు యాజమాన్యం తమ వ్యర్థ జల శుద్ధి ప్లాంట్ పనితీరును వెంటనే మెరుగుపరుచుకోవాలని, ల్యాబ్ నివేదికలో తేలిన లోపాలను యుద్ధప్రాతిపదికన సరిచేసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆంధ్ర పేపర్ మిల్లు, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పీసీబీ అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన రాజమహేంద్రవరం పీసీబీ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**డీపీఆర్ సిద్ధం చేయండి :** రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఒక్క చుక్క మురుగునీరు కూడా శుద్ధి కాకుండా గోదావరిలోకి వెళ్లకూడదన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం ఎంత మురుగునీరు ఉత్పత్తి అవుతోంది, భవిష్యత్తులో జనాభా పెరుగుదలతో ఎంత పెరుగుతుందనే అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. మురుగునీటి శుద్ధికి అవసరమైన ప్లాంట్ల సంఖ్య, అంచనా వ్యయం తదితర వివరాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

గోదావరి ప్రక్షాళనకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వ సహాయం కోసం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రితో ప్రత్యేకంగా మాట్లాడతానని తెలిపారు.

ఈ సమీక్ష సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి. కృష్ణయ్య, మెంబర్ సెక్రటరీ ఎస్. శరవణన్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

# సర్వైకల్ క్యాన్సర్‌పై సర్కార్ కవచం



(మొదటి పేజీ తరువాయి)

ఈ కేటగిరిలో రాష్ట్రంలో 3.45 లక్షల మంది బాలికలు ఉండగా సోమవారం నాటికి 78.57% మందికి టీకా వేసినట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు విడతలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780 డోసుల వ్యాక్సిన్ వచ్చిందని తెలిపారు. త్వరలోనే విద్యా సంస్థలు పునఃప్రారంభం కానున్నందున మిగిలిన బాలికలకు త్వరగా టీకా పంపిణీ పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశించారు. టీకా వేయించుకునేందుకు సందిగ్ధంలో ఉన్న వారికి అవగాహన కల్పించాలని స్పష్టంచేశారు.

**రియాక్షన్ కేసులేవీ నమోదు కాలేదు :** కేంద్ర ప్రభుత్వం పొడిగించిన గడువు ప్రకారం ఆగస్టులోగా టీకా పంపిణీ పూర్తి చేయాలని పేర్కొన్నారు. టీకా వేయించుకున్న 2.71 లక్షల మందిలో ఎటువంటి అనారోగ్య సమస్యలు కనిపించలేదని మంత్రి సత్యకుమార్ ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు గత ఫిబ్రవరి 28న విజయనగరం జిల్లా చీపురుపల్లిలో టీకా పంపిణీని ప్రారంభించారు. తొలుత నిర్ణయించిన ప్రకారం 3 నెలల్లోగా వ్యాక్సినేషన్ పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. క్షేత్ర స్థాయి పరిస్థితులకు అనుకూలంగా గడువును ఆగస్టు వరకు పొడిగించిశీది. రాష్ట్రంలో కోల్డ్ చైన్ సౌకర్యం కలిగిన 1,645 పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ భద్రపరుస్తున్నారు. టీకా ఇచ్చిన అనంతరం బాలికలు సదరు కేంద్రాల్లోనే వేచి ఉంటున్నారు. ఇప్పటివరకు ఎటువంటి రియాక్షన్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. ఈ టీకా అత్యంత సురక్షితమని, ప్రభావవంతమైందని మంత్రి వెల్లడించారు.

**తక్కువ నమోదు జిల్లాలపై దృష్టి పెట్టాలి :** అత్యధికంగా కర్నూలు జిల్లాలో 18,503, వైఎస్సార్ కడప-15,167, కాకినాడ-13,294, నంద్యాల-12,988, పల్నాడు జిల్లాలో 12,917 మంది బాలికలు ఈ టీకా వేయించున్నారు. తక్కువ(అట్టడుగు స్థాయి నుంచి)గా పోలవరం జిల్లాలో 1,251, అల్లూరి సీతారామరాజు 3,322, పార్వతీపురం-4,838, అన్నమయ్య-7,440, అనకాపల్లి జిల్లాలో 8,028 మంది బాలికలు టీకాలు వేయించుకున్నారు. తక్కువగా టీకాల నమోదు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

# ఫిలిప్పీన్స్‌ను వణికించిన భూకంపం



**దక్షిణ ఫిలిప్పీన్స్:** దక్షిణ ఫిలిప్పీన్స్‌ను సోమవారం తెల్లవారుజామున భారీ భూకంపం కుదిపేసింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.8గా నమోదైంది. ఈ భూకంపం ధాటికి మృతుల సంఖ్య 35కి పెరగ్గా.. దాదాపు 200 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. మరోవైపు, తీరప్రాంతంలోని పలు నగరాల్లో ఆస్తి నష్టం సంభవించింది. ఈ భూప్రకంపనలకు జనరల్ శాంటోస్ నగరం వణికిపోయింది. ఈ నగరంలో 7 లక్షల మంది జనాభా ఉంటారు. ఇక్కడ ట్యూనా ప్రాసెసింగ్ పరిశ్రమ చాలా పెద్దది. అక్కడి అంతర్జాతీయ విమానాశ్రయం కూడా తీవ్రంగా దెబ్బతింది.

తాజాగా సంభవించిన ప్రకృతి విలయాన్ని గత కొన్ని దశాబ్దాల్లో ఫిలిప్పీన్స్‌ను తాకిన అత్యంత శక్తిమంతమైన భూకంపాల్లో ఒకటిగా చెబుతున్నారు. దీని ప్రభావానికి పలు భవనాలు కుప్పకూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. జనరల్ శాంటోస్‌లో పలు భవనాలు కుప్పకూలాయి. ఓ ముఖ్యమైన వంతెనకు బీటలు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భూకంపం రాగానే.. ప్రభావిత తీర ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేసిన అధికారులు.. తక్షణమే ఎత్తైన ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు.

జనరల్ శాంటోస్‌కు నైరుతి దిశగా 8 మైళ్ల దూరంలో 6.2 మైళ్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో 10 అడుగుల ఎత్తున సునామీ అలలు విరుచుకుపడొచ్చని ఫిలిప్పీన్స్ వాసులను హెచ్చరించారు. మరోవైపు ఇండోనేషియా, మలేసియాలో 3 అడుగుల ఎత్తు వరకు సముద్రపు అలలు ఎగసిపడే అవకాశం ఉందని పసిఫిక్ సునామీ సెంటర్ పేర్కొంది. తైవాన్, జపాన్, పపువా న్యూ గినియా కూడా ప్రభావితం కావొచ్చని అంచనా వేశారు. ఫిలిప్పీన్స్ తీరంలో మూడు అడుగుల ఎత్తు వంకు సునామీ అలలు ఎగసిపడ్డాయి.

# టెస్టుల్లో టీమిండియా రికార్డు



**న్యూ చండీఘడ్:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో భారత్ ఘన విజయం సాధించింది. న్యూ చండీఘడ్‌లో మూడ్రోజుల్లోనే ముగిసిన ఈ టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో గెలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్ కేవలం 112 పరుగులకే ఆలౌటైంది. మూడోరోజైన సోమవారం ఆఫ్ఘన్ జట్టు 14 వికెట్లు కోల్పోయింది. టీమిండియా స్పిన్నర్లు మానవ్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరువికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించగా.. రెండో ఇన్నింగ్స్‌లో సుందర్(4/36), కుల్దీప్(3/30) బౌలింగ్‌లో రాణించారు. మానవ్‌కు ఒక వికెట్ దక్కింది. సోమవారం ఫాలో ఆన్ ఆడుతూ ఆఫ్ఘన్ జట్టు 93పరుగులకు 3 వికెట్లు కోల్పోయి పటిష్టంగా కనిపించింది. ఆ దశలో భారత స్పిన్నర్లు ఒక్కసారిగా చెలరేగారు. దీంతో ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్లు పెవీలియన్‌కు క్యూ కట్టారు. అంతకుముందు ఇండియా తన తొలి ఇన్నింగ్స్‌లో 564 పరుగులు చేయగా, ఆఫ్ఘనిస్తాన్ తన తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 152 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత స్పిన్నర్ మానవ్ సుతార్ ఆరు వికెట్లు తీసి ఆఫ్ఘన్ బ్యాటర్లను దెబ్బతీశాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఫాలోఆన్ ఆడిన ఆఫ్ఘన్ మరీ దారుణంగా చేతులెత్తేశారు. టాపార్డర్ బ్యాటర్ల దాదాపు విఫలం అయ్యారు. ఓపెనర్ అటల్ 42, గుర్బాజ్ 24 పరుగులు చేశారు. 412 పరుగులు వెనకబడి ఫాలోఆన్ ఆడిన ఆఫ్ఘనిస్తాన్ ఎక్కడ కూడా నిలదొక్కుకునే ప్రయత్నం చేయలేదు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు సత్తా చాటారు. ఆఫ్ఘనిస్తాన్ కేవలం 35.3 ఓవర్లలో తన రెండో ఇన్నింగ్స్ ముగిసింది. గాయం కారణంగా ఆఫ్ఘన్ ఆటగాడు షరఫుద్దీన్ అష్రఫ్ బ్యాటింగ్‌కు రాలేదు. దీంతో ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌పై భారత్ చారిత్రక విజయం సాధించింది. ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. టెస్టు క్రికెట్ చరిత్రలో టీమిండియాకు పరుగుల పరంగా ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. చరిత్ర సృష్టించిన టీమిండియా టీమిండియా 94 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో అతి భారీ విజయం సాధించింది. ముల్లాన్‌పూర్ వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో గెలవడంతో ఈ ఘనత సాధించింది. ఇన్నింగ్స్ తేడా పరంగా భారత్‌కు ఇదే అతి పెద్ద విజయం. 1932లో తొలి టెస్ట్ ఆడిన భారత్.. ఇప్పటివరకు ఇన్నింగ్స్ పరంగా ఇంత భారీ విజయం సాధించలేదు. 2018లో రాజ్‌కోట్ వేదికగా వెస్టిండీస్‌పై సాధించిన ఇన్నింగ్స్ 272 పరుగుల విజయం ఈ మ్యాచ్‌కు ముందువరకు వరకు భారత జట్టు అతి పెద్ద విజయంగా ఉండింది. స్కోర్ బోర్డు... ఇండియా తొలి ఇన్నింగ్స్: 564/8డిక్లేర్ ఆఫ్ఘనిస్తాన్ తొలి ఇన్నింగ్స్: 154ఆలౌట్ ఆఫ్ఘనిస్తాన్ రెండో ఇన్నింగ్స్: సిద్ధికుల్లా (సి)ప్రసిధ్ (బి)సుందర్ 42, అబ్దుల్ మాలిక్ (ఎల్ బి)సిరాజ్ 8, గుర్బాజ్ (సి)ప్రసిధ్ (బి)కుల్దీప్ 24, రామత్ షా (సి)మానవ్ (బి)సుందర్ 13, షాహిదీ (సి)గిల్ (బి)సుందర్ 5, జజయ్ (ఎల్ బి)మానవ్ 8, అజ్మతుల్లా (సి)కుల్దీప్ (బి)సుందర్ 4, ఖరోటే (సి)మానవ్ (బి)కుల్దీప్ 6, రామన్ షరీఫీ (నాటౌట్) 0, సలీమ్ షఫి (సి)సాయి సుదర్శన్ (బి)కుల్దీప్ 0, షరాఫుద్దీన్ (అబ్సెంట్ హర్ట్) 0, అదనం 2. (35.5 ఓవర్లలో ఆలౌట్) 112 పరుగులు. వికెట్ల పతనం: 1/42, 2/74, 3/87, 4/93, 5/98, 6/106, 7/106, 8/112, 9/112 బౌలింగ్: మానవ్ 10-2-29-1, ప్రసిధ్ 3-0-6-0, కుల్దీప్ 7.5-1-30-3, సిరాజ్ 4-1-11-1, సుందర్ 11-4-36-4.

# భారతీయ అద్భుత వరం యోగా



(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ లతో పాటు పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్, అధికారులు కలిసి యోగా శిక్షకుల ఆధ్వర్యంలో విభిన్న ఆసనాలు వేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను వారు పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో యోగా భాగం చేసుకోవడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ లభిస్తాయన్నారు. ఒత్తిడిని జయించడానికి యోగా ఒక్కటే మార్గమని ప్రపంచమంతా గుర్తిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల కేరళలో 'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్' అవార్డు తీసుకున్న సందర్భంలో అక్కడ వెల్‌నెస్ సెంటర్ల ప్రాధాన్యతను గమనించానని గుర్తుచేశారు. యోగా, ఆయుర్వేదాల వల్లే అక్కడ పర్యాటకం బాగా వృద్ధి చెందింది, విదేశీయులు కూడా ఆసక్తి చూపుతున్నారు. అదే తరహాలో ఏపీలోని 1058 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీరంలో పెద్ద ఎత్తున వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి, పర్యాటకులను ఆకర్షించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోందని స్పష్టం చేశారు. "ఈ రోజు ఒక్కపూట యోగా చేయడం వల్లే నాకు ఎంతో మానసిక ప్రశాంతత లభించింది. సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధ్యమవుతుంది. యోగా అనేది కేవలం ఈ రోజుతో ముగిసేది కాదు, ఇది ఆరోగ్యకరమైన జీవితానికి ఒక ఆరంభం మాత్రమే" అని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ..'యోగాంధ్ర' కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనల్ని మనం జయించడమే అసలైన విజయం అని, దానికి యోగా, మెడిటేషన్ (ధ్యానం) ఎంతో తోడ్పడతాయని తెలిపారు. యోగా భారతదేశ గొప్ప సంపద అన్నారు. యోగాను కేవలం ఒక శారీరక వ్యాయామంగా చూడకుండా, జీవనశైలిలో భాగం చేసుకోవాలని కోరారు. తాను ప్రస్తుతం వారానికి రెండు రోజులు యోగా చేస్తున్నానని, ఇకపై ఆ సంఖ్యను మరింత పెంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో కారాగార అధికారులు, సిబ్బంది మరియు ఖైదీలు పెద్ద సంఖ్యలో పాల్గొని, అత్యంత క్రమశిక్షణతో యోగాసనాలు వేశారు. క్రమశిక్షణతో పాల్గొన్న వారందరికీ మంత్రి దుర్గేష్ అభినందనలు తెలియజేశారు.

# అంగన్వాడీ టీచర్లకు స్క్రీనింగ్ టెస్ట్ శిక్షణ



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ) : మండలం కేంద్రంలోని కంది మల్లాయపల్లి జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్ లో మండల స్థాయి అంగన్వాడీ టీచర్ లకు ఏ ఐ ఆధారిత స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం న కు,53 మంది అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ ముంతాజ్ బేగం వైద్యాధికారి సంపత్ మాట్లాడుతూ ఏ ఐ సాంకేతిక వినియోగం పిల్లల అభివృద్ధి మరియు స్క్రీనింగ్ ప్రక్రియలో ఏ ఐ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్వాడి టీచర్లకు చిన్నారుల ఆరోగ్య,అభివృద్ధి సమస్యలను ప్రారంభ దశలోని గుర్తించేందుకు ఏ ఐ ( ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ) ఆధారిత స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణపై ప్రత్యేక శిక్షణ,చిన్నారుల శారీరక మానసిక మరియు సంబంధిత సమస్యలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వేగంగా గుర్తించే విధానాలను అంగన్వాడి కేంద్రాలలో సేవలు పొందుతున్న చిన్నారులకు సేవలు అందించడంలో ఈ స్క్రీనింగ్ టెస్ట్ ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీ టీచర్లకి యాప్ వినియోగం డేటా నమోదు ప్రక్రియ ఫలితాల విశ్లేషణ తదితర అంశాలపై ప్రయోజిక శిక్షణ అందించడమైనది చిన్నారుల అభివృద్ధిలో ఏమైనా లోపాలు గుర్తించినట్లయితే వెంటనే సంబంధిత వైద్య సేవలకు అనుసంధానం చేయాలని సూచించారు. పిల్లల అభివృద్ధి మరియు స్క్రీనింగ్ ప్రక్రియ ప్రాముఖ్యత వివరించారు.

ఈ కార్యక్రమశీలోసూపర్వైజర్స్ ప్రత్యూష, సుబ్బరత్న, వరలక్ష్మి సౌజన్య, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# మోదీ-చంద్రబాబు పాలనలో అభివృద్ధి ప్రస్థానంపై నేడు ఎన్డీయే భారీ సభ



- భారీగా తరలిరావాలని ప్రజలు, కార్యకర్తలకు బీజేపీ నేత నాగోతు రమేష్ నాయుడు పిలుపు

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో నేడు దామినేడు గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు కోరారు.

ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు ఈ సభలను నిర్వహిస్తున్నట్లు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో జరగనున్న ఎన్డీయే సభల్లో భాగంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్న ఆయన, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాలు, రైతు, మహిళా సాధికారత కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు.

ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ సభ ద్వారా రాష్ట్ర అభివృద్ధి దిశపై ప్రజలకు స్పష్టత కలుగుతుందని అన్నారు.

కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని నాగోతు రమేష్ నాయుడు విజ్ఞప్తి చేశారు.

# భారత్, చైనాలు ప్రత్యర్థులుగా కాదు- సహకార భాగస్వాములుగా ఉండాలి: బీజింగ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భారత్, చైనా సంబంధాలపై బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనాలు ప్రత్యర్థులు కాదని, సహకార భాగస్వాములని తెలిపింది. ఒక దేశ అభివృద్ధికి మరొక దేశం ముప్పు కాదని అభిప్రాయపడింది. ఇరు దేశాలు సరైన వ్యూహాత్మక దృక్పథానికి కట్టుబడి ఉండాలని పేర్కొంది. ప్రస్తుతం చైనా–భారత్ సరిహద్దుల్లో పరిస్థితి సాధారణంగా ఉందని స్పష్టం చేసింది. ఇరుపక్షాల మధ్య సజావుగా సమాచార మార్పిడి జరుగుతోందని వెల్లడించింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు.

**పాక్‌తో సంబంధాలపై చైనా స్పందన ఇదే! :** పాకిస్థాన్‌తో చైనాకున్న సన్నిహిత సంబంధాలపై భారత్ వ్యక్తం చేసిన ఆందోళనల గురించి లిన్ స్పందించారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా పాకిస్థాన్, భారత్ తమ విభేదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆ ప్రాంతాన్ని శాంతియుతంగా, స్థిరంగా ఉంచడంలోనూ భారత్, పాకిస్థాన్ రెండింటికీ చైనా మద్దతు ఇస్తుందని అన్నారు. అలాగే భారత్, చైనా, రష్యా సంబంధాలపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మూడు దేశాలు వర్ధమాన ఆర్థిక వ్యవస్థలని అభిప్రాయపడ్డారు. పటిష్టమైన సంబంధాలను కొనసాగించడం ఆయా దేశాల ప్రయోజనాలకు మాత్రమే కాకుండా ప్రపంచ శాంతి, భద్రత, స్థిరత్వానికి కూడా దోహదపడుతుందని వెల్లడించారు. త్రైపాక్షిక సహకారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రష్యా, భారత్‌లతో సంప్రదింపులు కొనసాగించడానికి చైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

**'ఈ మూడు దేశాలు ఒకదానికొకటి పూర్తిగా స్వతంత్రమైనవి' :** సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో అంతర్జాతీయ వార్తా సంస్థల అధినేతలతో మాట్లాడిన సందర్భంగా చైనా, భారత్ సంబంధాలపై పుతిన్ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, బీజింగ్‌లతో రష్యాకు దశాబ్దాలుగా ఉన్న భాగస్వామ్యం సహజంగానే ఏర్పడిందన్నారు. ఈ దేశాలన్నీ ఒకదానికొకటి పూర్తిగా స్వతంత్రమైనవని అన్నారు. భారత్–చైనా సంబంధాల్లో తమ జోక్యం ఉండబోదని వెల్లడించారు. అలాగే ఆ రెండింటి మధ్య ఉన్న సరిహద్దు వివాదాన్ని ఇరు దేశాలూ సామరస్యంగా పరిష్కరించుకుంటాయనే విశ్వాసాన్ని కనబర్చారు. "భారత్, చైనా సంబంధాల్లో రష్యా ?జోక్యం చేసుకోవడం మంచి ఆలోచన కాదు. వాస్తవానికి మేము మా మిత్రులైన భారత్, చైనాలు రెండింటితోనూ సంప్రదింపులు జరుపుతాం. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని మోదీ ఇద్దరూ సరిహద్దు సమస్యతో సహా పరస్పర ఆసక్తి ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. భారత్, చైనాలతో రష్యా సంబంధాలు సహజసిద్ధంగా అభివృద్ధి చెందాయి. చైనాతో రష్యాకు మంచి సంబంధాలు ఉన్నా, భారత్‌తో బంధంలో రాజీపడబోం. దిల్లీతో మాస్కోకు పెరుగుతున్న సమన్వయం బీజింగ్‌కు నష్టం కలిగించదు" అని పుతిన్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు నేపథ్యంలో భారత్‌తో తమ సంబంధాలపై చైనా వివరణ ఇచ్చింది. చైనా, భారత్‌లు పోటీదారులుగా, ప్రత్యర్థులుగా కాకుండా సహకార భాగస్వాములుగా ఉండాలని నొక్కిచెప్పింది.

**భారత్- చైనా సంబంధాలు ఎలా ఉన్నాయంటే? :** 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్, చైనా సైన్యాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు అప్పట్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024లో రష్యాలోని కజాన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సమావేశం అయ్యారు. ఆ తర్వాత గతేడాది టియాంజిన్‌లో జరిగిన ఎస్‌ఈఓ శిఖరాగ్ర సమావేశానికి హాజరైనప్పుడు ఈ దేశాధినేతలు రెండోసారి కలిసి పలు అంశాలపై చర్చలు జరిపారు. ఈ క్రమంలో చైనా, పాక్ మధ్య సంబంధాలు కాస్త మెరుగుపడ్డాయి.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

- **మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ.. సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశాలు**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడంపై రాష్ట్ర మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న వెంటనే విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సహాయక చర్యల పురోగతిపై ఆరా తీసిన మంత్రి, అధికారులు సమన్వయంతో పనిచేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్న మంత్రి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు ఒంగోలు నుంచి మంత్రి హుటాహుటిన విశాఖ బయలుదేరారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కూడా ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అవసరమైన వైద్య సహాయం అందించాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం విశాఖ చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా ప్రమాద ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. సహాయక చర్యలపై ఆరా తీసిన ఆయన మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

మంత్రి కందుల దుర్గేష్ స్టీల్ ప్లాంట్ కార్మికుల మృతి బాధాకరమని పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కూడా ప్రమాద ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పలువురు కార్మికులు మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను ముమ్మరం చేసి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం అత్యంత దురదృష్టకరం

- **విశాఖ బయలుదేరిన కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ**
- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎయిర్ అంబులెన్స్ సిద్ధం**
- **కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ**

**భీమవరం (జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్)లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదం అత్యంత దురదృష్టకరమైన ఘటన అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాదానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.

స్టీల్ తయారీ ప్రక్రియలో భాగంగా సుమారు 1500 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో ఉన్న 150 టన్నుల ద్రవరూప ఉక్కును లాడెల్ ద్వారా నెంబర్–2 మిషన్ వద్దకు తరలిస్తున్న సమయంలో పేలుడు సంభవించినట్లు ప్రాథమిక సమాచారం అందిందని మంత్రి తెలిపారు.

ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడం అత్యంత విచారకరమని పేర్కొన్న ఆయన, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రమాద సమయంలో సమీప మిషన్ వద్ద విధుల్లో ఉన్న ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని, వారిలో నలుగురి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉండగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం వారిని తరలించేందుకు ఎయిర్ అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

ప్రమాద తీవ్రత దృష్ట్యా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి కూడా విశాఖకు బయలుదేరారని శ్రీనివాస వర్మ తెలిపారు. తాను కూడా రోడ్డు మార్గంలో విశాఖకు బయలుదేరినట్లు చెప్పారు. ప్రమాద ప్రాంతంలో వేడి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రస్తుతం అక్కడికి వెళ్లే పరిస్థితి లేదని అధికారులు తెలిపారని, అయితే విశాఖ చేరుకున్న అనంతరం ప్లాంట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ప్రమాదానికి గల సాంకేతిక కారణాలను పూర్తిస్థాయిలో సమీక్షిస్తామని మంత్రి స్పష్టం చేశారు. లాడెల్ ద్వారా ద్రవరూప ఉక్కు తరలింపు సమయంలో ఏదైనా సాంకేతిక లోపం తలెత్తిందా లేదా ఇతర కారణాల వల్ల పేలుడు సంభవించిందా అనే అంశాలపై సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంపై బీజేపీ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం పట్ల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో జరిగిన ఈ ప్రమాదంలో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉండగా జరిగిన ఈ దుర్ఘటన కార్మిక వర్గానికే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు.

ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం, అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వాన్ని, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు.

కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి పరిశ్రమ యాజమాన్యం బాధ్యత అని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

# ఓపెన్ స్కూల్ కన్వీనర్ సాంబ శివ రెడ్డి ని వెంటనే సస్పెండ్ చెయాలి

- **వైస్సార్సీపీ కడప జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు పసుపులేటి సాయి దత్త**
- **డీఎస్సీ అవకతవకలపై ప్రభుత్వ వైఖరి ప్రశ్నార్థకం**





**కడప (జర్నలిస్ట్ ఫైల్ ) :** డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై గత కొన్ని రోజులుగా పలు ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో, వాటిపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది...అయితే ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, వాటిని ఖండించేందుకు సమావేశాలు నిర్వహించడం అనుమానాలకు తావిస్తోంది.

ఇటీవల కడపలో నిర్వహించిన సమావేశంలో డీఎస్సీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని పేర్కొన్నప్పటికీ, ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసే విధంగా స్పష్టమైన ఆధారాలు చూపాల్సిన అవసరం ఉంది...అలాగే ప్రభుత్వ కార్యక్రమం కాని ఒక సమావేశంలో జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సాంబ శివ రెడ్డి పాల్గొనడం, నిర్వాహక పాత్ర పోషించడం పట్ల కూడా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ లేదా పక్షపాత కార్యక్రమాలకు దూరంగా ఉండాలనే నిబంధనలు ఉన్న నేపథ్యంలో, ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది... ప్రజాస్వామ్యంలో విమర్శలను అణిచివేయడం కాకుండా, వచ్చిన ఆరోపణలపై పారదర్శకంగా స్పందించి నిజాలను వెలుగులోకి తీసుకురావడమే ఉత్తమ మార్గం...

డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తు, నిరుద్యోగ యువత ఆశలు, ప్రజల విశ్వాసం దృష్ట్యా ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నాము.

ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ పై అఖిల భారత విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఈరోజు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయడం జరిగింది...ఆయన ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ పార్టీ కార్యక్రమంలో పాల్గొడం తప్పు.దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి అని కోరడం జరిగింది కార్యక్రమం లో వైస్సార్సీపీ విద్యార్థి విభాగం కడప జిల్లా అధ్యక్షులు పసుపులేటి సాయి దత్త గారు,ఖాదీ కన్వీనర్ జయవర్ధన్ గారు, కే.సుబ్బరాయుడు గారు ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి, జబ్బార్ గారు వైస్సార్సీపీ విద్యార్థి విభాగం కడప నగర ఉపా అధ్యక్షులు మరియు వైస్సార్సీపీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ రెడ్డి గారు మరియు అఖిల భారత విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.


# 'జన్ ధన్' ఖాతాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలోకి కోట్లాది మంది



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** బ్యాంక్ అకౌంట్లు లేని కోట్లాది మంది సామాన్యులను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడంలో 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' (పీఎంజేడీవై) అద్భుత విజయం సాధించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాజాగా 58 కోట్ల అకౌంట్ల మైలురాయిని దాటిన సందర్భంగా.. ఈ పథకం దేశ బ్యాంకింగ్ రంగ హిస్టరీలోనే అతిపెద్ద 'గేమ్ చేంజర్' అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొనియాడారు. దేశంలోని ప్రతీ ఒక్కరికీ డిజిటల్, బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చిన ఈ పథకం.. దేశ ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసిందని పేర్కొన్నారు.

ఈ పథకం ద్వారా 58 కోట్లకు పైగా ఖాతాలు తెరుచుకోగా, కోట్లాది మంది మొదటిసారిగా అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థలోకి అడుగుపెట్టారు. జన్ ధన్ ఖాతాల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి చేరుతోంది. దీంతో మధ్యవర్తులు, లీకేజీల సమస్యలు గణనీయంగా తగ్గాయి. ఇప్పటివరకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా సుమారు రూ. 45 లక్షల కోట్లను నేరుగా ప్రజల ఖాతాలకు జమ చేసింది. పేదల సంక్షేమం, పారదర్శకత, డిజిటల్ చెల్లింపుల విస్తరణలో ఈ పథకం కీలక పాత్ర పోషించిందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# పరస్పర దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తం !



**టెహ్రాన్, జెరూసలేం, వాషింగ్టన్ :** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమై సోమవారానికి వంద రోజులకు చేరింది. తాజా పరిణామాల నేపథ్యంలో మళ్ళీ పూర్తి స్థాయిలో ఇరు పక్షాల మధ్య యుద్ధం చెలరేగే ప్రమాదం కనిపిస్తోంది. ఇజ్రాయిల్, ఇరాన్‌లు సోమవారం తెల్లవారు జామున పరస్పరం దాడులు జరుపుకున్నాయి. సెంట్రల్, పశ్చిమ ఇరాన్‌లపై ఇజ్రాయిల్ దాడులు జరిపింది. ఇరాన్ నుండి వచ్చిన క్షిపణి దాడికి ప్రతిగా తామీ వరుస దాడులకు పాల్పడినట్లు తెలిపింది. ఇరాన్ నుండి వస్తున్న క్షిపణులను అడ్డుకునేందుకు ఇజ్రాయిల్ తన వైమానిక రక్షణ బలగాలను ఉపయోగించింది. సెంట్రల్ ఇజ్రాయిల్‌లో కొన్ని పేలుళ్ళు వినిపించాయి. రెండు మిలటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నామని ఐఆర్‌జిసి బలగాలు ప్రకటించాయి. ఆపరేషన్ విక్టరీలో భాగమే ఈ దాడులని వ్యాఖ్యానించింది. ఇరాన్‌లో మూడు చోట్ల రాడార్ కేంద్రాలపై ఇజ్రాయిల్ దాడులు జరిపినందుకే ఈ ప్రతీకార దాడులని పేర్కొంది. వాయవ్య ఇరాన్‌లోని పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లో అనేక లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ మిలటరీ సోమవారం ప్రకటించింది. ఇరాన్‌లో వ్యూహాత్మక రక్షణ వ్యవస్థను, దేశవ్యాప్తంగా ఉన్న రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేశామని తెలిపింది. దాడుల నేపథ్యంలో టెహరాన్‌లో ఖమేనీ అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టుపక్కల ప్రాంతాలను ఇరాన్ మూసివేసింది. ప్రస్తుత దాడులకు అమెరికానే కారణమని వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ చర్యలను అమెరికా విధానం నుండి వేరు చేసి చూడలేమని పేర్కొంది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘె పత్రికా సమావేశంలో వ్యాఖ్యానించారు.

మరోవైపు ఇజ్రాయిల్‌పై యెమెన్ హౌతి రెబెల్స్ కాల్పులు జరిపారు. ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్‌కు చెందిన నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో ఉద్రిక్తతలు పెచ్చరిల్లే ముప్పు పొంచి వుంది. ఏప్రిల్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదం లేదు. అక్కడ ఇజ్రాయిల్ పదాతి దాడులతో సహా అన్ని రకాల దాడులను ఉధృతం చేసింది. ఇరాన్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అమెరికాతో కుదిరే ఏ కాల్పుల విరమణ ఒప్పందమైనా లెబనాన్‌లోకూడా యుద్ధం ఆగాలని కోరుతోంది. ఇజ్రాయిల్ ఇందుకు ఒప్పుకోవడం లేదు.

**తక్షణమే కాల్పులు ఆపండి : ట్రంప్**

ఈ దాడులపై వైట్‌హౌస్ స్పందించలేదు. అమెరికా సమన్వయంతోనే ఈ దాడులు జరుగుతున్నాయా లేదా అన్నది కూడా తెలియరాలేదు. ఇరాన్ క్షిపణి దాడులకు వెంటనే స్పందించవద్దని ట్రంప్, నెతన్యాహును కోరారని, కానీ నెతన్యాహు కార్యాలయం నుండి దీనిపై ఎలాంటి స్పందన లేదని సీనియర్ అమెరికా అధికారి ఒకరు వెల్లడించారు. అంతకుముందు ట్రంప్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, లెబనాన్‌పై దాడుల విషయంలో ఇజ్రాయిల్ తీరు నచ్చడం లేదని చెప్పారు. నిర్ణయాలు తీసుకునేది తానేనని, ఇజ్రాయిల్ కాదని ఆయన స్పష్టం చేశారు. నెతన్యాహుకు ఎలాంటి చాయిస్ వుండబోదని అన్నారు. ఇరాన్ కూడా దాడులు ఆపి, చర్చా వేదిక వద్దకు రావాలన్నారు. ఇరు పక్షాలు తక్షణమే కాల్పుల ఆపాలంటూ ట్రంప్ సోమవారం సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు.

**చైనా ఆశాభావం :** ఇరాన్, ఇజ్రాయిల్‌లు కాల్పుల విరమణ పాటించాలని చైనా కోరింది. సోమవారం తాజా దాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని పూర్తి స్థాయిలో గౌరవించి, అమలు చేయాలని కోరింది. ఘర్షణలు ఇలా కొనసాగడం ఎవరికీ మంచిది కాదని వ్యాఖ్యానించింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ విలేకర్లతో వ్యాఖ్యానించారు.

## గునపం పార్టీ వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమం



**-నల్ల బెలూన్ లను ఎగురా వేసి నిరసన తెలిపిన వైసీపీ నాయకులు**

**కదిరి, జూన్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :** గునపం పార్టీ వెన్నుపోటు కు రెండేళ్లు కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేసిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా, వెన్నుపోటు కు రెండేళ్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు,కదిరి సమన్వయ కర్త బియస్. మక్బుల్ అహ్మద్ ఆధ్వర్యంలో కదిరి టౌన్ హాల్ నందు,,చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా నల్లబెలున్లు ఎగురవేయడం, రెండు సంవత్సరాలనుండి చేస్తున్న అరాచకాలను ఫోటో ఎగ్జిబిషన్ ప్రదర్శన ద్వారా మక్బుల్ అహ్మద్ వివరించారు,ఆ తరువాత , యువత, మహిళా, రైతులకు చేసిన మోసాలకు నిరసనగా నల్ల బెలూన్ లను ఎగురావేశారు, ఆ తర్వాత ఈ నెల 12 వ తేదీన జరుగు గునపం పార్టీ వెన్నుపోటు కు రెండేళ్లు నిరసన గా భారీ ర్యాలీ కోసం ఏర్పాట్లు సమీక్షా సమావేషం, నిర్వహించారు,,ఈ కార్యక్రమనికి నియోజకవర్గం లోని టౌన్ మరియు మండలాల కన్వీనర్ లు, రాష్ట్ర స్థాయి నాయకులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ స్థాయి నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, తాజా మాజి సర్పంచులు, జడ్పీటీసీ లు ఎంపీటీసీ లు,ఎంపీపీ లు,కౌన్సిల్లర్లు, మహిళా నాయకురాళ్లు, వైస్సార్సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## యోగాంధ్ర 2026 కార్యక్రమం ఏర్పాట్లపై కంబం చెరువు కట్ట ను పరిశీలించిన జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే ముత్తుముల





**మార్కాపురం, జూన్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 సందర్భంగా నిర్వ హించనున్న "యోగా ంధ్ర 2026 గిద్దలూరు నియోజకవర్గం కంబం చెరువు కట్ట పై యోగాంధ్ర ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి జిల్లా యంత్రాంగం పరిశీలించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ యోగా కార్యక్రమంలో భాగంగా కంబం చెరువు కట్ట ను ప్రధాన వేదికగా ఎంపిక చేసిన నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పాల్గొననున్న యోగా సాధకులకు అవసరమైన వసతులు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లు, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## సీహెచ్‌పీ వద్ద హరీశ్‌రావును అడ్డుకున్న పోలీసులు



**-సింగరేణి పరిరక్షణ సదస్సు పర్యటనలో ఉద్రిక్తత**

**రామ్ మందిర ఏరియా, జూన్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి పరిరక్షణ సదస్సులో పాల్గొనేందుకు రామగుండం చేరుకున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు పర్యటన సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. సింగరేణి సంస్థలో బొగ్గు నిల్వల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రామగుండంలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)కు వెళ్లిన హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు.హరీశ్‌రావు పర్యటన నేపథ్యంలో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీహెచ్‌పీ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అనుమతించకపోవడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. ప్రజా సమస్యలు, సింగరేణి పరిస్థితులను తెలుసుకునేందుకు వచ్చిన ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని వారు విమర్శించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో బొగ్గు నిల్వలు, ఉత్పత్తి పరిస్థితులపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే తమ లక్ష్యమని చెప్పారు. అయితే పోలీసుల ఆంక్షల కారణంగా క్షేత్రస్థాయి పరిశీలనకు అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.కాగా, హరీశ్‌రావు పర్యటనతో రామగుండం ప్రాంతంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సింగరేణి పరిరక్షణ అంశంపై నిర్వహించనున్న సదస్సుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# జనక్ ప్రసాద్‌పై విమర్శలు సహించం: ధర్మపురి



**-జేబీసీసీఐ సమావేశాల్లో కార్మికుల ప్రయోజనాల కోసం కీలక పాత్ర పోషించారని ప్రశంస**

**రామ్ మందిర ఏరియా, జూన్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :** జేబీసీసీఐ సమావేశాల్లో పాల్గొని బొగ్గు గని కార్మికుల ప్రయోజనాల కోసం కీలక పాత్ర పోషించిన INTUC సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్‌పై అనవసర విమర్శలు చేయడం సరికాదని INTUC సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి అన్నారు. జనక్ భవన్‌లో RG-1 వైస్ ప్రెసిడెంట్ కె. సదానందం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సింగరేణిలో రాష్ట్రీయ కోల్ మజ్దూర్ సంఘ్ (RCMS) పేరుతో యూనియన్ నిర్వహిస్తున్న కొందరు నాయకులు కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. గత ఏడాది బొగ్గు గని కార్మికులకు సంబంధించిన ౹ూ= బోనస్ పెంపులో జనక్ ప్రసాద్ కీలక పాత్ర పోషించారని, కార్మికుల హక్కుల కోసం ఐదు దశాబ్దాలుగా నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడిపై కేవలం ప్రచారం కోసం విమర్శలు చేయడం తగదన్నారు.ప్రజాస్వామ్యంలో ఎవరైనా సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చని, అయితే కార్మికుల సమస్యల పరిష్కారంలో చేసిన సేవల ఆధారంగానే నాయకత్వాన్ని అంచనా వేయాలని ధర్మపురి సూచించారు. 2007లో ఎన్నికల్లో పోటీ చేసిన తర్వాత ఇప్పటి వరకు కార్మికుల కోసం =జమీ నాయకులు సాధించిన విజయాలను కార్మికులకు వివరించాలని ఆయన ప్రశ్నించారు.తెలంగాణలో సుమారు 1.20 కోట్ల మంది కార్మికులకు సంబంధించిన కనీస వేతనాల సవరణ ప్రక్రియను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి సహకారంతో కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా జనక్ ప్రసాద్ విజయవంతంగా అమలు చేశారని ధర్మపురి గుర్తుచేశారు. ఈ చర్యతో లక్షలాది కార్మిక కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందన్నారు.సింగరేణిలో మెడికల్ బోర్డు వ్యవస్థ నిలిచిపోవడానికి కారణమైన వారినే పక్కన కూర్చోబెట్టుకుని కార్మికుల హక్కుల కోసం పోరాడతామనడం విడ్డూరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. కార్మికుల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేస్తున్న నాయకులపై విమర్శలు మానుకుని, కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని హితవు పలికారు.RG-1 వైస్ ప్రెసిడెంట్ కె. సదానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో INTUC నాయకులు లక్ష్మీపతి గౌడ్, గడ్డం కృష్ణ, బార్ల మనోహర్, బుచ్చిరెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

### కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు





**పెద్దపల్లి, జూన్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :** పెద్ద పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం పెద్దపల్లి పట్టణంలో ఘనంగా నిర్వ హించబడింది. ఈ సమా లవేశం మాజీ శాసన సభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు హాజరయ్యారు. ఆయనతో పాటు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ , హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## గాజులతండా రహదారికి మరమ్మతులు



**సింగరేణి, (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి మండలం ,భాగ్యనగర్ తండా గ్రామ పంచాయతి పరిధిలో గాజుల లతండా సీతా రాంపురం రహదారి మరమ్మతు పనులను సర్పంచ్ బానోత్ హిరాలాల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు.దారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు,సర్కార్ తుమ్మ చెట్లు పెరిగి ఆ మార్గంలో ప్రయాణించే వారికి ఇబ్బందిగా మారింది. రైతులు నిత్యం ఆ దారి వెంట పోలాలకు వెళుతుంటారు.దీనిని దృష్టి లో పెట్టు కొని భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హిరలాల్ జేసీబీ తో మూళ్ళ పొదలు తొలగించి, ఆ దారి పై ఉన్న గుంతలను మట్టి తో పూడ్పించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ బీముడు, మాజీ ఎంపీటీసీ బానోత్ రాంచందర్,గుగులోత్ ఈశ్వర్, పంచాయతీ సిబ్బంది హేంచంద్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా యోగాంధ్ర--2026 శిక్షణ కార్యక్రమం



**మార్కాపురం, జూన్ 08 (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్‌డీఓ ఏపీ రంగనాయకులు, మండల అభివృద్ధి అధికారి ఎన్. మధుసూదన్ రెడ్డి, ఆయుష్ డాక్టర్, ఏపీడీ గురువర కుమార్, పీడీ రమణ రెడ్డి తదితరులు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత మరియు శారీరక దృఢత్వాన్ని పెంపొంది ంచేందుకు ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు రాబోయే 2026 యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అలాగే యోగా గురువులు చెక్కా కృష్ణ , మాధవ కృష్ణారావు యోగా సాధన ప్రాముఖ్యతను వివరించి, పలువురు విద్యార్థులు మరియు ప్రజలకు ప్రదర్శనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, యోగా గురువులు, శిక్షణార్థులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## నల్లగండ్ల చెరువు పునరుద్ధరణకు పట్టాదారుల గ్రీన్ సిగ్నల్



**సైబరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** నగరంలో చెరువుల సంరక్షణ, పున రుద్ధరణ ధ్యేయంగా సాగుతున్న హైడ్రా ముంద డుగుకు నల్లగండ్ల చెరువు ప్రైవేటు పట్టా దారులు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటించి సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. సైబరాబాద్ నగరపాలక సంస్థ పరిధిలోని రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని నల్లగండ్ల చెరువు అభివృద్ధి కోసం తమ భూములు ఇచ్చేందుకు అంగీకరిస్తూ పట్టాదారులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి సంతకాలతో కూడిన అంగీకార పత్రాలను అందజేశారు. ఒకప్పుడు సాగు, తాగునీరు అందించిన ఈ చెరువు పట్టణీకరణ వల్ల మురికికూపంగా మారిందని, హైడ్రా చేపట్టే పనులతో దీనికి మళ్లీ పూర్వవైభవం వస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, భూములు కోల్పోతున్న తమకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) పాలసీ కింద ఎలాంటి జాప్యం లేకుండా త్వరగా నష్టపరిహారం అందేలా చూడాలని కమిషనర్‌కు విన్నవించారు. మొత్తం 89.69 ఎకరాల ఎఫ్‌టీఎల్ పరిధి గల ఈ చెరువులో 36.37 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, మిగిలిన 53.32 ఎకరాల విస్తీర్ణం ప్రైవేట్ పట్టాదారుల పరిధిలోనే ఉంది. ప్రస్తుతం రూ.28 కోట్లతో హైడ్రా ఈ చెరువును ఆధునికీకరిస్తుండగా, ఇందులో భాగంగా వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, పిల్లల ప్లే ఏరియాలు, వ్యాయామ పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. చెరువుల పునరుద్ధరణకు పట్టాదారులు ఇలా సహకరించి ముందుకు రావడం శుభపరిణామమని కొనియాడిన కమిషనర్ ఏవీ రంగనాథ్, నిబంధనల ప్రకారం వారికి టీడీఆర్ పరిహారం త్వరితగతిన అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## గంగదేవి గుట్ట త్రవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్థులు



**సింగరేణి, (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి మండల గుట్టకిందగుంపు పరిధిలో గోదాం పేరుతో గుట్ట త్రవ్వకాన్ని గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. గోదాం నిర్మాణం పేరు అక్రమంగా మట్టిని అమ్ముకుంటున్నారని గ్రామస్థులు ఆరోపించారు.గ్రామస్థుల ఆందోళన కు కాంగ్రెస్ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు మద్దతు ప్రకటించారు. ప్రకృతిని పరవసింపజేసే గంగాదేవి గుట్టను నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని గ్రామస్థులు హెచ్చరించారు.అధికారులు జోక్యం చేసుకొని మట్టి దందా ఆపాలి అని కోరారు.ఎటువంటి అనుమతులు లేకుండా పట్టపగలు గుట్టను త్రవ్వి సదరు కాంట్రాక్టర్ మట్టిని అమ్ముకుంటుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు.ఇప్పటి కైన మట్టి దందా ఆపకపోతే తహసిల్దార్ ఆఫీస్ ముందు బైఠాయించి ఉద్యమం చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు.కాంగ్రెస్ జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు మాట్లాడుతూ గుట్టకిందగుంపు గ్రామస్థులది న్యాయమైన డిమాండ్ అని అన్నారు.గోదాం పేరుతో కాంట్రాక్టర్ అక్రమంగా మట్టి అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. అనుమతిలేని తవ్వకాల తో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టటమే కాకుండా సహజ సిద్ధమైన ప్రకృతి ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి తోలకం ఆపకపోతే ఎంతటి పోరాటానికైనా సిద్ధం అవుతామని హెచ్చరించారు

## ఏ ఎస్ ఆర్ కాలనీలో జలకం రత్తమ్మకి ఘన నివాళి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 08(జర్నలిస్ట్ ఫైల్) : భద్రాచలం అల్లూరి సీతారామరాజు కాలనీలోని ఆదివాసీ కుల పెద్ద జలకం రత్తమ్మ భౌతికకాయాన్ని ఆదివాసీ నాయకులు సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 1988లో అల్లూరి సీతారామరాజు కాలనీ సాధన కోసం రత్తమ్మ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అలాగే కొత్త మార్కెట్‌లో నిర్మించిన షాపులను ఆదివాసీలకు కేటాయించే విషయంలో ఆమె విశేష కృషి చేశారని పేర్కొన్నారు. కాలనీలో నిర్వహించే సమ్మక్క--సారలమ్మ జాతర ఏర్పాట్లు, నిర్వహణలోనూ ఆమె ఎప్పుడూ ముందుండి సేవలందించేవారని కొనియాడారు. ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. అనంతరం నాయకులు రత్తమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, కుంజా ధర్మారావు, మానె రామకృష్ణ, పూనెం వీరభద్రం, గుండి శరత్, జగ్గా పుల్లయ్య, జగ్గా కుమారి, సున్నం భూలక్ష్మి, కోర్సా చినబాబు దొర, కుంజా శ్రీను, కుంజా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## జిహెచ్ఎంసి తెలంగాణ జలమండలి ఎన్నికలలో ఐఎన్టియుసి బిఆర్ఎస్ పై మొగుళ్ళ రాజిరెడ్డి ఘనవిజయం




(జర్నలిస్ట్ ఫైల్) మహేశ్వరం జూన్ 08 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ మాట్లాడుతూ... జిహెచ్ఎంసి తెలంగాణ జలమండలి ఐఎన్టియుసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి.. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిపై ఘనవిజయం మొత్తం ఓటర్లు 2900 పోలైన ఓట్లు 2761 ఎం రాజిరెడ్డి తెలంగాణ జిల్లా మండలి ఎంప్లాయిస్ యూనియన్ గా 1739 ఓట్లు సాధించారు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాంబాబు యాదవ్ కి , 983 ఓట్లు రాగా చల్లని ఓట్లు 39 మొత్తం మెజార్టీ 717 ఓట్ల మెజారిటీతో మొగుళ్ళ రాజిరెడ్డి ఘన విజయం సాధించారు సంజీవరెడ్డి ఆల్ ఇండియా ఐఎన్టియుసి ప్రోత్సాహం వల్ల ఈ విజయం సాధించినట్లు తెలియజేశారు ఎన్నికైన సందర్భంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది తెలంగాణ జనరల్ సెక్రెటరీ ఎర్రగని నాగన్న గౌడ్, మరియు తెలంగాణ ఐఎన్టిసి అడ్వైజర్ ఆర్ డి చంద్రశేఖర్, మరియు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఐలేష్ గౌడ్ మహేశ్వరం నియోజకవర్గం నడికుడ శివ డివిజన్ ప్రెసిడెంట్ కప్పల రాజు మరియు ఐఎన్టి నాయకులు పాల్గొనట్టుగా నడికుడ శివ ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.

## మహేశ్వరం పట్టణ శాఖ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా దుంపల ప్రకాష్ నియామకం



(జర్నలిస్ట్ ఫైల్) మహేశ్వరం జూన్ 08 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం లో మహేశ్వరం పట్టణ శాఖ ఉపాధ్యక్షులుగా దుంపల ప్రకాష్ నీ నియమించడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొహమ్మద్ అబ్దుల్ జావిద్, అల్లే బిక్షపతి, శివగంగా ఆలయ కమిటీ డైరెక్టర్ పేయ్యల దేవేందర్, . కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్, సేవాదళ్ మండల అధ్యక్షులు శెట్టి అశోక్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మహేశ్వరం మండల్ చైర్మన్ 8 వ వార్డు ఇంచార్జ్ మహమ్మద్ ఇర్షాద్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నడికుడా రాకేష్ ముదిరాజ్ యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు స్వర్ణగంటి ఆకాష్, యువ నాయకులు కాకి శివ రామకృష్ణ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరం గ్రామ 2 వ వార్డు ఇంచార్జ్ గదగుటి మహేందర్ ముదిరాజ్,14 వ వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు, యూత్ క్రికెటర్ ముచ్చంతల శ్రీను, రెడ్డి సంఘం నాయకులు గడ్డం నారాయణరెడ్డి,సీనియర్ నాయకులు రేవెళ్ల జంగయ్య, మోతే యాదయ్య, గగనం ఆంజనేయులు,స్వర్ణగంటి చంద్రయ్య, మోదిని నాగరాజు, రేవెల్ల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు

## బాసరలో సీట్లు సాధించిన సిరికొండ పీఎం శ్రీ ఆదర్శ పాఠశాల విద్యార్థులు!







నిజామాబాద్ రూరల్ సిరికొండ జూన్ 08 (జర్నలిస్ట్ ఫైల్) : పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం ఘన అభినందనలు నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణా ఆదర్శ పాఠశాల కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ప్రతిష్టాత్మకమైన బాసర ప్రవేశాలలో ఈ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు సీట్లు సాధించి, పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఈ క్రింది విద్యార్థులు బాసరకు ఎంపికయ్యారు:గాండ్ల అభిజ్ఞవేంపల్లి శ్రీజకీసాపురం ప్రణతిరౌండ్ల వైష్ణవిగుగ్లోత్ శివంజలిమాలవత్ యువరాజ్ ప్రిన్సిపాల్ మరియు చైర్మన్ అభినందనలు:ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి గారు మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కాంతమ్మ గారు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థుల పట్టుదల, కఠిన శ్రమకు, ఉపాధ్యాయుల సరైన మార్గదర్శకత్వం, పర్యవేక్షణ తోడవ్వడం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని కొనియాడారు.గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల నుండి ఒకేసారి ఆరుగురు విద్యార్థులు ఐఐఐటీకి ఎంపికవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు సిబ్బంది హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో గడువు లోగా పూర్తి చేయాలి

**: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**- రూ. 3.15 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం- రూ. 33 కోట్లతో రహదారుల అభివృద్ధి, జాతీయ రహదారుల అనుసంధాన పనులకు భూమిపూజ- 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఉపముఖ్యమంత్రి**





ఖమ్మం, ముదిగొండ, (జర్నలిస్ట్ ఫైల్) : క్షేత్ర స్థాయిలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో గడువులోగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలికి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ముదిగొండ మండలంలోని యడవల్లి గ్రామంలో రూ.3.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, ముదిగొండ మండల కేంద్రంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈఆర్వో (ఈఆర్ఓ) కార్యాలయ భవనానికి, మండలంలో రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.33 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు రహదారుల అభివృద్ధి పనులకు కూడా ఉప ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. అనంతరం యడవల్లి లక్ష్మీపురం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ముదిగొండ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని ఉప ముఖ్యమంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా పరిసర గ్రామాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని, గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు గ్రామ పంచాయతీ భవనం భవనం ఉపయోగపడనుందని తెలిపారు. ప్రజలకు విద్యుత్ సంబంధిత సేవలు మరింత సులభంగా అందించేందుకు ఈఆర్ఓ భవనం దోహదపడనుందని అన్నారు. ముదిగొండ మండలంలో 33 కోట్లతో చేపట్టిన రహదారుల నిర్మాణం పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగు పడటంతో పాటు జాతీయ రహదారులతో అనుసంధానం బలోపేతం కానుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణ అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.





పనుల పురోగతిపై నిరంతర సమీక్ష నిర్వహిస్తూ, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల అద్భుత ప్రతిభ

**- రాష్ట్రస్థాయి ర్యాంకింగ్స్‌లో మెరిసిన చాంపియన్స్**



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (టి ఎస్ టిటిఏ) తాజాగా విడుదల చేసిన రాష్ట్రస్థాయి క్రీడాకారుల ర్యాంకింగ్స్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు అద్భుతమైన ర్యాంకులు సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు. ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (కేడిటిటిఏ) సర్దార్ పటేల్ స్టేడియం అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న పలువురు క్రీడాకారులు బాలికల, బాలుర విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ ఘనత సాధించిన క్రీడాకారులను ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్ కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి (డివైఎస్ఓ) సునీల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా అభినందించారు.ఈ సందర్భంగా ప్రెసిడెంట్ బాలసాని విజయ్ కుమార్ మాట్లాడుతూ క్రీడాకారుల కఠోర శ్రమ, అంకితభావం వల్లే రాష్ట్రస్థాయిలో ఖమ్మం జిల్లాకు ఈ అరుదైన గౌరవం దక్కిందని కొనియాడారు. రాబోయే రోజుల్లో వీరు జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.డివైఎస్ఓ సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికితీయడంలో అసోసియేషన్, కోచ్‌లు చేస్తున్న కృషి అభినందనీయమని, యువ క్రీడాకారులకు జిల్లా క్రీడా విభాగం నుండి ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన క్రీడాకారుల వివరాలను వెల్లడించారు.

బాలికల విభాగం

అండర్-11 లో బి. హార్విక లక్ష్మి (14వ ర్యాంక్), పి. ఆరాధ్య (17వ ర్యాంక్), టి. రోస్మిత (27వ ర్యాంక్).

అండర్-13 లో బి. సాయి శివాని (18వ ర్యాంక్).

అండర్-17 లో జి. సిరి (22వ ర్యాంక్).

అండర్-19 లో జి. సిరి (16వ ర్యాంక్), బి. సాయి శివాని (22వ ర్యాంక్).

బాలుర విభాగంలో

అండర్-11 లో ఎ. యశ్వంత్ (23వ ర్యాంక్).

అండర్-13 లో ఇ. హరి (22వ ర్యాంక్).

అండర్-19 లో పి. జ్వలిత్ (23వ ర్యాంక్), ఇ. హరి (29వ ర్యాంక్)

క్రీడాకారుల అద్భుత విజయానికి కారణమైన కోచ్‌లను, అలాగే క్రీడాకారుల తల్లిదండ్రులను అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా ప్రేమికులు ప్రత్యేకంగా అభినందించారు.

## మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా ఈర్లపూడి గ్రామానికి చెందిన గోపి



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : మానవత్వాన్ని చాటుకున్న ఈర్లపూడి గ్రామానికి చెందిన గోపి మరోసారి తన గొప్ప మనసున్న మనిషి గా నిరూపించారు. గత కొద్ది రోజులుగా లివర్ ఇన్ఫెక్షన్‌తో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న, కాల్వొడ్డు ప్రాంతంలో నివసిస్తున్న ప్రసాద్ కి అత్యవసరంగా రక్తం అవసరం ఏర్పడింది.ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా నా తమ్ముడు గోపి స్పందించి, స్వయంగా ముందుకు వచ్చి అవసరమైన రక్తాన్ని దానం చేశారు. అత్యవసర పరిస్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడేందుకు తన వంతు సహాయం చేస్తూ, మానవత్వానికి నిజమైన అర్థాన్ని తన కార్యచరణ ద్వారా చూపించారు.అవసరంలో ఉన్న వారికి అండగా నిలబడటం, ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం వంటి గొప్ప గుణాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయి. గోపి ఈ సేవా భావం నిజంగా ప్రశంసనీయం, అనుసరణీయమైనది.ఇలాంటి మానవతా సేవలు సమాజంలో మరింత మంది ముందుకు రావడానికి ప్రేరణ కలిగించాలి అని కోరుకుందాం.

## బదిలీ అయిన ఏ ఈ ఓ బాలకృష్ణకు ఘన సన్మానం




తిరుమలాయపాలెం జూన్ 08 (జర్నలిస్ట్ ఫైల్) : పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండల పరిధిలోని సుబ్లేడు గ్రామ రైతు వేదికలో అగ్రికల్చర్ ఏఈఓ బాలకృష్ణ బదిలీ అయిన సందర్భంగా రైతులు శాలువాతో సన్మానం చేసినారు. రైతులకు చేసిన సేవలను కొనియాడిన,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి గ్రామ సర్పంచ్ శ్రీమతి స్వాతి సుమన్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపసర్పంచ్ భూక్యా కానీల్ కుమార్, మండల అగ్రికల్చర్ ఏఓ సీతారామ్ రెడ్డి, హస్నాబాద్ గ్రామ ఉపసర్పంచ్ మాగి బాలకృష్ణ, వార్డ్ మెబర్ గంధసిరి శ్రీనివాస్,గడ్డం కృష్ణ రెడ్డి, గడ్డం అనిల్ రెడ్డి,గంధసిరి లింగమూర్తి,పోలేపొంగు సాయికుమార్, గంధసిరి విజయ్, గంధసిరి శ్రీకాంత్, గంధసిరి శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మంలో ఘనంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు

**జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్**



ఖమ్మం,జూన్ 08 (జర్నలిస్ట్ ఫైల్):తెలంగాణ జర్నలిస్టు ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ నాయకుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తొలి రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య 61వ జన్మదిన వేడుకలు స్థానిక ఖమ్మం నగరంలో గల అన్నం ఫౌండేషన్ వారి అనాథ శరణాలయంలో కేక్ కట్ చేసి అనంతరం, పండ్లు కూడా పంచుతూ మామిడి సోమయ్య జన్మదిన వేడుకలు ఖమ్మం జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుపుకోవడం జరిగింది. అనంతరం శ్రీ కుసుమా రియల్ ఎస్టేట్ వారి గార్డెన్ లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి సోమయ్య పేరు మీద శివుడికి ఇష్టమైన కదంబ చెట్టును నాటడం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ మాట్లాడుతూ సోమయ్య ప్రస్థానం ఉమ్మడి నల్గొండ జిల్లా గా ఉన్నప్పుడు మొదలై ఇప్పుడు ప్రస్తుతం సూర్యాపేట జిల్లా గా మార్పు చెందింది. ఆనాడు నల్లగొండ జిల్లా లోని సూర్యాపేట కు చెందిన, సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సోమయ్య, హైదరాబాద్‌లో పీ.జీ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) పూర్తి చేసి, జర్నలిజాన్ని సామాజిక సేవా సాధనంగా మల్చుకున్నారు. ఉద్యమ ప్రస్థానం 2008లో 1300 మంది సభ్యులతో కూడినగ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ని స్థాపించారు. 2009లో హైదరాబాద్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సంస్థల నిర్మాణం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో పాత్రికేయులను ఏకం చేస్తూ 2010లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్‌ను, ఆ తర్వాత 2014 జూన్ 12న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ను స్థాపించి 33 జిల్లాలకు విస్తరించారు. ముఖ్య పోరాటాలు, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, బీమా, పింఛన్లు, పాత్రికేయ స్వేచ్ఛ మరియు రక్షణ కోసం మూడు దశాబ్దాలుగా నిరంతర పోరాటాలు సాగించారు. అందుకున్న ప్రతిష్ఠాత్మక పురస్కారాలు. గౌరవ డాక్టరేట్ (2020) గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుండి 'డాక్టర్ ఆఫ్ జర్నలిజం' పట్టా. రాష్ట్రస్థాయి అవార్డులు. పాత్రికేయ శిరోమణి పురస్కారం' (2019), 'పాత్రికేయ సేవా రత్న పురస్కారం', నల్లగొండ జిల్లాలో 'ఉగాది శ్రేష్ఠ పాత్రికేయ పురస్కారం (2026)' జాతీయ పురస్కారం. సామాజిక బాధ్యత గల జర్నలిజానికి గాను జాతీయ స్థాయి ప్రైస్ అవార్డు 60 ఏళ్ల జీవన ప్రస్థానాన్ని, 30 ఏళ్ల ఉద్యమ ప్రయాణాన్ని పూర్తి చేసుకుని 61వ వసంతంలోకి అడుగుపెడుతున్న మామిడి సోమయ్యకు ఖమ్మం జిల్లా టీడబ్ల్యూజెఎఫ్ (హెచ్ -2843), అధ్యక్షులు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేములకొండ రమేష్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్ల రాకేష్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కందరబోయిన నాగకృష్ణ మరియు మామిడాల కిరణ్, టీబీజేఎ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కరుణాకర్ సుదగాని, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, టీబీజేఎ నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, పులిపాటి పాపారావు, ఫెడరేషన్ సభ్యులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలనిఆకాంక్షించారు.






## మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా కాజ ఈస్ట్ లేక్ పార్క్ నిర్మాణం



- సెల్కాన్ సంస్థ రూ.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి
- త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానున్న కాజ ఈస్ట్ లేక్ పార్క్

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన పర్యావరణం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా కాజ గ్రామంలో ఈస్ట్ లేక్ పార్క్ నిర్మాణం పూర్తి కావస్తోంది. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో సెల్కాన్ సంస్థ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద రూ. 3 కోట్ల వ్యయంతో ఈ పార్క్‌ను అభివృద్ధి చేసింది.
సుమారు 17 ఎకరాల 18 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ ఆధునిక హంగులతో పార్క్‌ను తీర్చిదిద్దారు. పార్క్‌లో మొత్తం 11,600 మొక్కలను నాటడంతో పచ్చదనంతో నిండిన ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు 1.7 కిలోమీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు.
అదేవిధంగా ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం ప్రత్యేక ప్లే ఏరియా, భద్రత కోసం ఫెన్సింగ్, ఆధునిక సుందరీకరణ పనులు చేపట్టి పార్క్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.
త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్న ఈస్ట్ లేక్ పార్క్ మంగళగిరి ప్రాంత ప్రజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇలాంటి పార్క్ ను అందుబాటులోకి తీసుకొచ్చిన మంత్రి నారా లోకేష్‌కు కాజ గ్రామస్తులు, ప్రాంత ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేయాలి



- నగర కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** యోగాంధ్ర--2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 7 నుంచి 21వ తేదీ వరకు గుంటూరు నగరంలో నిర్వహించనున్న యోగా అవగాహన, శిక్షణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు నగరంలో సుమారు 5 లక్షల మంది ప్రజలు యోగాలో పాల్గొనేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమాల నిర్వహణ కోసం కార్పొరేషన్ స్థాయిలో యూఎల్బీ కమిటీ, ప్రతి వార్డులో స్వర్ణ వార్డు స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, మార్కెట్లు తదితర ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రోజువారీ యోగా సాధనతో పాటు ప్రధాన యోగా ప్రదర్శనలకు అనువైన వేదికలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.
వార్డు స్థాయి ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ యోగాంధ్ర కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించి, ఫొటోలు, నివేదికలను జీఎంసీ యోగాంధ్ర హెల్ప్‌డెస్క్‌కు పంపాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమాలను ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కోరారు.

## భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క ఆశయాల కోసం పనిచేయాలి : అబ్రహం లింకన్



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక శివ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు అబ్రహం లింకన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్నంలోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు డైవరి గుంటూరు జిల్లా న్యాయవాది బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుర నాగేశ్వరావు, డాక్టరేట్ అందుకున్న పలువురు బురదగుంట సతీష్ బాబు, కంచర్ల విజయవర్ధనలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ యొక్క భావజాలం కలిగి అంబేద్కర్ యొక్క ఉన్నత ఆశయాల కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ట్రస్ట్ పలువురు ప్రముఖులు ట్రస్టు నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాబ్ డ్రైవర్‌పై దాడి.. టాలీవుడ్ నటుడు సుప్రీత్‌పై కేసు నమోదు

**కీసర (జర్నలిస్ట్ ఫైల్ ):** టాలీవుడ్ ప్రముఖ నటుడు సుప్రీత్ క్యాబ్ డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలతో కేసు నమోదైంది. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుడు, ఉబెర్ క్యాబ్ డ్రైవర్ శ్రీహరి అందించిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, వనస్థలిపురం నుంచి కుందన్‌పల్లికి ట్రిప్ పూర్తి చేసిన డ్రైవర్ శ్రీహరి, నాగారం చౌరస్తా వద్ద రోడ్డు పక్కన కారును నిలిపి తదుపరి బుకింగ్ కోసం వేచి చూస్తున్నాడు. అదే సమయంలో ఫార్చ్యూనర్ కారులో అటుగా వచ్చిన నటుడు సుప్రీత్ రెడ్డి, వాహనాన్ని రోడ్డుకు అడ్డంగా ఎందుకు పెట్టావంటూ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో తనను అసభ్య పదజాలంతో దూషించి, భౌతికంగా దాడి చేయడమే కాకుండా తన మొబైల్ ఫోన్‌ను లాక్కున్నారని శ్రీహరి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంటనే బాధితుడు 'డయల్ 100'కు ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. అనంతరం డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సుప్రీత్‌పై కేసు నమోదు చేశారు.

## సేవకు, యువ నాయకత్వానికి పెద్దపీట వేసిన టిడిపి: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీలో ఖాళీ అయిన 3 రాజ్యసభ స్థానాలకు టిడిపి అభ్యర్థులుగా ఎంపికైన సానా సతీష్, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ ల నామినేషన్ సోమవారం ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో జరగగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరై రాజ్యసభకు ఎంపికైన అభ్యర్థులకు పుష్పగుచ్ఛంతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ టిడిపి రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో పార్టీ అజినాయకత్వం సామాజిక న్యాయం, పార్టీకి అందించిన సేవలు, యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ పార్టీ అధ్యక్షులు సీఎం చంద్రబాబు నాయుడు ఈ ముగ్గురు అభ్యర్థులను ఖరారు చేయడం జరిగిందన్నారు. కాకినాడకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సిట్టింగ్ రాజ్యసభ సభ్యుడు సాన సతీష్ పార్టీ కష్ట కాలంలో అండగా నిలవడంతో పాటు సామాజిక సమతుల్యతను దృష్టిలో ఉంచుకొని అధిష్టానం మరోసారి అవకాశం ఇవ్వటం జరిగిందన్నారు. ప్రముఖ విద్యావ్యత్త, భాష్యం గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్ట్యూషన్స్ చైర్మన్ భాష్యం రామకృష్ణ టిడిపి ప్రతిపక్షంలో ఉండగా పార్టీకి అన్ని విధాల అండగా నిలవడం, సమాజ సేవకు, విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తించి ఎగువ సభకు పార్టీ అవకాశం కల్పించిందన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ గత వైసిపి పాలనలో టిడిపి సోషల్ మీడియా, డిజిటల్ ప్రచారంలో క్రియాశీలక పాత్ర పోషించి పలు ఉద్యమాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. సామాజిక సమతుల్యతను పాటిస్తూ అంకితభావం, పార్టీకి ఎనలేని సేవలను అందిస్తూ పార్టీ అభ్యున్నతికి పాటుపడిన సమర్థవంతులైన నాయకులను గుర్తించి రాజ్యసభ సభ్యులుగా ఎంపిక చేసి ఎగువ సభలకు పంపించడం శుభ పరిణామం అన్నారు.

## 12న రెండు ఏళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** రెండు ఏళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం ఈ నెల 12వ తేదీన అమరావతి పెరేడ్ గ్రౌండ్స్ లో కార్యక్రమాలను నిర్వహించుటకు ప్రతిపాదించింది. దీనిపై ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ సోమవారం పరిశీలించారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనే అవకాశాలు ఉన్నాయని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తాగు నీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పెద్ద సంఖ్యలో వాహనాలు తరలిరానున్న దృష్ట్యా పార్కింగ్ స్థలం ఏర్పాటు, పర్యవేక్షణ పక్కాగా ఉండాలని, అవసరమగు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరుకానున్న దృష్ట్యా వచ్చే రహదారి, సాధారణ ప్రజలు వచ్చే మార్గం ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని అన్నారు. సభా ప్రాంగణంలో వివిధ శాఖలు సాధించిన విజయాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రదర్శన శాలలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రదర్శన శాలలను ముఖ్యమంత్రి పరిశీలించి సభా వేదిక వద్దకు చేరుకుంటారని చెప్పారు.
ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి సి.హెచ్. కృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎన్.వి.సుందరాచారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, రవాణా శాఖ ఉప కమిషనర్ కె.సీతారామిరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ లు ఎం.శ్రీనివాస రావు, ఎం.టి.ఎం.సి కమిషనర్ అలీం భాషా, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, తహసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల అర్జీలను గడువులోగా పరిష్కరించాలి: జీఎంసీ అదనపు కమిషనర్




**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజల నుంచి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జి. సాంబశివరావు విభాగాధిపతులను ఆదేశించారు. నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.
ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా అందే ఫిర్యాదుల్లో ఎక్కువగా పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలు ఉంటున్నాయని తెలిపారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు.
అర్జీల పరిష్కారంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే దరఖాస్తుదారులకు వివరించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మొత్తం 41 అర్జీలు అందాయని తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 11, ఇంజినీరింగ్ విభాగానికి 17, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపా సెల్‌కు 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించిన 2 ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, డీసీపీ సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

# ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):** ఐతానగర్ లో మంగళవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం ఏర్పాటు చేసినట్లు నన్నపనేని ఆంజనేయులు, శాఖమూరి నారాయణ ప్రసాద్, ఈదర పూర్ణచందులు తెలిపారు.
స్థానిక ఐతనగర్లో ఏర్పడి చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ సౌజన్యంతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సహకారంతో ఐతానగర్ లోని నన్నపనిని సీతారామయ్య, సరస్వతమ్మ కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరానికి మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలియజేశారు .
మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి, పలువురు ప్రముఖులు కూడా ఈ కార్యక్రమానికి హాజరైనట్లు వారు తెలిపారు. నన్నపనేని బుచ్చయ్య, నన్నపనేని సుశీల జ్ఞాపకార్థం గ్రామీణ ప్రాంత ప్రజల మెరుగైన ఆరోగ్య కోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు వారు కోరారు. శిబిరానికి వచ్చిన వారందరికీ ఎంతో విలువైన పరీక్షలను నిపుణులైన బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ వైద్య బృందం ద్వారా ఉచితంగా చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.
సమావేశంలో డాక్టర్ నన్నపనేని ఆంజనేయులు, శాఖమూరి నారాయణ ప్రసాద్, ఈదర పూర్ణచంద్, కాకుమాను రాంబాబు, వసంతం అశోక్ వర్ధన్, కాకుమను సత్యం, ఎన్నారై సాంబశివరావు, పాలడుగు ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన" కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12న తుళ్లూరు మండలం రాయపూడి గ్రామ రెవెన్యూ పరిధిలోని రిపబ్లిక్ డే పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న "సుపరిపాలన" కార్యక్రమ ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పరిశీలించారు. ఈ కార్యక్రమానికి సుమారు 10 వేల మంది ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమ ప్రాంగణం, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భద్రతా చర్యలను ఎస్పీ పరిశీలించారు. రాయపూడిలోని రిపబ్లిక్ డే పరేడ్ గ్రౌండ్‌తో పాటు సమీపంలోని ఈ-6 రహదారి, హైకోర్టు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.
ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు ఎస్పీ సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రత్యేక అతిథుల రాకపోకలకు అవసరమైన భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.
కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తుళ్లూరు ఎస్‌డీపీఓ మురళీకృష్ణ, గుంటూరు ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఎస్బీ సీఐలు మల్లికార్జునరావు, తుళ్లూరు పోలీస్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ఆర్థిక పరిపుష్టికి సెంట్రల్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లే మూల స్తంభాలు



- సెంట్రల్ జిఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** కేంద్ర ప్రభుత్వానికి అధిక మొత్తంలో ఆదాయం సమకూర్చడంలో సెంట్రల్ ట్యాక్స్ ఇన్స్పెక్టర్ల పాత్ర కీలకమైందని సెంట్రల్ జి.ఎస్.టి కమిషనర్ అరుణ్ రిచర్డ్ అన్నారు. సోమవారం కన్నవారితోట లోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో నూతనంగా పదోన్నతి పొందిన సెంట్రల్ ట్యాక్స్ ఇన్స్పెక్టర్లకు కమిషనర్ అభినందనలు తెలిపారు. అరుణ్ రిచర్డ్ మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక పరిపుష్టి కి సెంట్రల్ ట్యాక్స్ ఇన్స్పెక్టర్లే మూల స్తంభాలన్నారు. ఉద్యోగోన్నతి మరింత భాధ్యత ను పెంచుతుందని, సమర్ధవంతమైన పనితీరుతో శాఖ పురోభివృద్ధి కి దోహదపడాలన్నారు.
దేశ ఆర్థిక ప్రగతి కోసం ప్రతి ఉద్యోగి చిత్త శుద్ధి, అంకిత భావంతో పనిచేయాలని సూచించారు.
అనంతరం పదోన్నతి పొందిన ఏడుగురు ఇన్స్పెక్టర్ల ను కమిషనర్ అభినందించి, మిఠాయిలు తినిపించారు. ట్యాక్స్ అసిస్టెంట్ క్యాడర్ నుంచి ఇన్స్పెక్టర్ కు పదోన్నతి పొందిన వారిలో శాఖమూరి శ్రీనివాస్, ఆలంకి సుధీర్, కొల్లి అనితా దేవి, బిల్లా ప్రశాంత్ కుమార్, ఎన్.శరత్ బాబు, వి.వి.ఎన్.కె.ప్రదీప్ కుమార్, వి. లక్ష్మీ పార్వతి ఉన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న తుళ్లూరు మండలం వెంకటపాలెం టోల్ ప్లాజా సమీపంలోని వెస్ట్ బైపాస్ రోడ్డుపై నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. సుమారు 25 వేల మంది పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
తుళ్లూరు మండలం రాయపూడిలోని నూతన సీఆర్‌డీఏ కార్యాలయంలో జరిగిన సమావేశానికి గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత వర్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.
సమావేశంలో మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, పార్కింగ్, వైద్య సేవలు, తాగునీరు, పారిశుధ్యం, పాల్గొనే ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై చర్చించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు నిర్ణయించారు.
సమావేశంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, సీఆర్‌డీఏ కమిషనర్ విజయరామరాజు, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్, సీఆర్‌డీఏ అధికారులు, పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ నలువైపుల స్వాగతం బోర్డులు ఏర్పాటు




- రోటరీ 3150 గవర్నర్ సోమవరపు వెంకట రాంప్రసాద్ వెల్లడి

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్ ):** రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం రోటరీ పబ్లిక్ ఇమేజ్ లో భాగంగా తెనాలి పట్టణ నలువైపులా స్వాగతం బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని రోటరీ 3150 గవర్నర్ సోమవరపు వెంకట రాంప్రసాద్ పేర్కొన్నారు. ఈ బోర్డులను రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోటరీ 3150 గవర్నర్ సోమవరపు వెంకట రాంప్రసాద్ ప్రారంభించి రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ క్లబ్ ద్వారా భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలను చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో రోటరీ 3150 అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్, డిస్టిక్ క్యాబినెట్ మెంబర్ కన్నెగంటి మురళీకృష్ణ, క్లబ్ సభ్యులు వీరవల్లి మురళీకృష్ణ, మల్లాది అర్జున్, ఉన్నవ సూర్యనారాయణ, రాజశేఖర్ రెడ్డి,కిట్స్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ఢిల్లీలో 'ఇండియా బ్లాక్' కీలక సమావేశం




**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రతిపక్ష 'ఇండియా' బ్లాక్ సోమవారం న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైంది. వామపక్ష నేతలు జాన్ బ్రిట్టాస్, దీపాంకర్ భట్టాచార్య, పి. సంతోష్ కుమార్ సహా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా , పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, బీహార్ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పశ్చిమబెంగాల్ మాజీ సిఎం, టిఎంసి అధ్యక్షురాలు మమతా బెనర్జీ తో పాటు టిఎంసి ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా సమావేశానికి హాజరయ్యారు. శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాకరే వర్చువల్ విధానంలో ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఇటీవల తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టివికె)తో కాంగ్రెస్ చేతులు కలిపి, డిఎంకెతో ఉన్న దీర్ఘకాల భాగస్వామ్యానికి ముగింపు పలకడంతో .. ఈ సమావేశానికి స్టాలిన్ దూరంగా ఉన్నారు. అయితే, తమిళనాడుకు చెందిన విడుతలై చిరుతైగళ్ కచ్చి (వీసీకే) అధ్యక్షుడు తోల్ తిరుమావళవన్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి) ఎంపీ ఎన్‌కె ప్రేమచంద్రన్ ఈ భేటీకి హాజరయ్యారు.

ఇండియా బ్లాక్ సమావేశాన్ని చూసి బిజెపి భయపడుతోందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కె.సి.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఢిల్లీలో రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా వెలసిన పోస్టర్లపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. తనకు అటువంటి పోస్టర్లు కనిపించలేదని కొట్టిపారేశారు. బిజెపి రాజకీయ ఆధిపత్యాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు, కూటమిలోని అంతర్గత విభేదాల పరిష్కారానికి కూడా ఈ సమావేశం అత్యంత కీలకంగా మారనుంది. పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి ఓటమి తర్వాత ఈ భేటీ జరగడం గమనార్హం. కేరళ అసెంబ్లీ ఎన్నికల సమయంలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్ డి ఎఫ్)కు వ్యతిరేకంగా కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలను ఈ సమావేశంలో ఎండగడతామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతలు వామపక్షాలకు బిజెపితో పొత్తు ఉందంటూ కాంగ్రెస్ అధిష్టానం వ్యాఖ్యానించడం సరికాదని అన్నారు. పరస్పర గౌరవం, విశ్వాసం లేనప్పుడు ఐక్య ఉద్యమాన్ని నిర్మించడం సాధ్యం కాదని ఆయన అన్నారు. 'దేశాన్ని కాపాడండి, బిజెపి హటావో' అనే ఉమ్మడి లక్ష్యంతో ఏర్పడిన ఇండియా బ్లాక్ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తామని రాజా తెలిపారు.

కేరళ ఎన్నికల సమయంలో తమ నాయకత్వంపై జరిగిన 'వ్యవస్థాగత ప్రచారం'పై సిపిఐ(ఎం) సైతం అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ఇండియా బ్లాక్ ఐక్యతను కాపాడేందుకు ఎంపీ జాన్ బ్రిట్టాస్‌ను సమావేశానికి పంపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ సీనియర్ నేత నాయకుడు జైరామ్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ కీలక సమావేశానికి మొత్తం 23 రాజకీయ పార్టీలు హాజరవుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ పేర్కొన్నారు. పార్టీల మధ్య కొన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నాయనే ఊహాగానాలను కొట్టిపారే-స్తూ.. ఇండియా బ్లాక్ ఐక్యంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

## బీహార్‌లో నెల్లూరు యాత్రికుల బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం

- ప్రమాదంలో ముగ్గురు మరణించడం బాధాకరమన్న సీఎం
- క్షతగాత్రులకు తక్షణ వైద్యసాయం అందించేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్ ):** బీహార్‌లోని ఔరంగాబాద్ సమీపంలో నెల్లూరు జిల్లాకు చెందిన కాశీ యాత్ర టూరిస్ట్ బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. క్షతగాత్రులకు అందుతోన్న వైద్యంపై ఆరా తీశారు. నెల్లూరు జిల్లా నుంచి 46 మంది యాత్రికులతో కాశీ వెళ్లిన ఈ బస్సు ఔరంగాబాద్ వద్ద మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టిందని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, 15 మందికి గాయాలయ్యాయని వివరించారు. బీహార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి బాధితులకు సాయం అందేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రమాదం నుంచి బయటపడిన యాత్రికులను స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. సీఎం ఆదేశాల మేరకు బీహార్ ఉన్నతాధికారులతో పాటు అక్కడి స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో ఏపీ అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను గయాలోని అనుగ్రహ నారాయణ మగధ్ మెడికల్ కాలేజ్-హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న బాధితులంతా క్షేమంగానే ఉన్నారని అధికారులు తెలిపారు. యాత్రికులను స్వస్థలాలకు చేర్చే అంశంపై బీహార్ ప్రభుత్వంతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

## ప్రజా సేవే పరమావధి: మంత్రి కందుల దుర్గేష్



- నిడదవోలులో ఉచిత మజ్జిగ పంపిణీ చేసిన మంత్రి కందుల దుర్గేష్
- మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ.. పాల్గొన్న మంత్రి దుర్గేష్
- ఎండల్లో దాహార్తిని తీర్చడం అభినందనీయం: మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్ ):** నిడదవోలు నియోజకవర్గం నిడదవోలు పట్టణంలోని గణేష్ చౌక్ వద్ద మానవత నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో వేసవికాలాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ నిర్వహిస్తున్న ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసి, మండుతున్న ఎండల్లో దాహార్తిని తీర్చే ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని అభినందించారు. ప్రజా సేవే పరమావధిగా భావించి నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మానవత సంస్థ సభ్యులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.

## గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: బీజేపీ వినతి




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు గుంటూరు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

గీత కార్మికుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారికి అవసరమైన సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జనతా వారధి కో-కన్వీనర్లు షేక్ సాంబశివరావు, మార్తా నరేంద్రబాబు, కత్తి మేరీ సరోజినీ, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు అబ్రహం, మండల అధ్యక్షుడు మల్లాల లక్ష్మణ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వై. సుబ్బారావు, జిల్లా కార్యదర్శులు మార్తా నరేంద్ర, కృష్టిపాటి నారాయణ రెడ్డి, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కంతేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు జరిపితే.. బీజేపీ గెలిచే అవకాశమే లేదు: తేజస్వి యాదవ్

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్ ):** దేశంలో ఎన్నికల ప్రక్రియపై ఆర్జేడీ నేత, బీహార్ అసెంబ్లీ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో జరిగిన 'ఇండియా' కూటమి కీలక సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఈవీఎంలకు బదులుగా పాత పద్ధతిలోనే బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే... రాబోయే రోజుల్లో బీజేపీ విజయం సాధించే అవకాశమే లేదని ఆయన అన్నారు.

ఇదే సమావేశంలో ప్రతిపక్షాల ఐక్యతపై మాట్లాడుతూ.. 'ఇండియా' కూటమిలోని అన్ని భాగస్వామ్య పక్షాలు ఐదు ప్రధానాంశాలపై పూర్తి స్థాయి ఏకాభిప్రాయానికి వచ్చాయని తేజస్వి వెల్లడించారు. భవిష్యత్తులో ఈ ఐదు అంశాలపైనే కలసికట్టుగా, ఐక్యంగా పోరాడాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకాన్ని, పారదర్శకతను మరింత బలోపేతం చేయాలంటే బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించడం ఒక్కటే మార్గమని అన్నారు. తేజస్వి యాదవ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు జాతీయ రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు దారితీశాయి.

## విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీఎస్ ఆర్టీసీలో ప్రవేశపెట్టనున్న విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. నిర్ణయాన్ని మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఉద్యమాలు చేపడతామని ప్రకటించింది.

విజయవాడలోని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏపీఎస్ ఆర్టీసీ జేఏసీని ఏర్పాటు చేశారు.

జేఏసీ కన్వీనర్లుగా వై. శ్రీనివాసరావు (ఎన్ఎంయూఏ), పలిశెట్టి దామోదరరావు (ఆర్టీసీ ఈయూ) ఎంపికయ్యారు. కేంద్రం అందిస్తున్న విద్యుత్ బస్సుల రాయితీలను ఆర్టీసీ వినియోగించుకుని బస్సులను స్వయంగా కొనుగోలు చేసి, ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని వారు కోరారు.

ప్రైవేట్ ఆపరేటర్లకు విద్యుత్ బస్సులతో పాటు డిపో స్థలాలను లీజు పేరుతో అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని జేఏసీ ఆరోపించింది. ఇది ఆర్టీసీ భవిష్యత్తుకు ముప్పుగా మారడంతో పాటు ప్రైవేటీకరణకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. సంస్థలో ఖాళీల భర్తీ, 4000 కొత్త బస్సుల కొనుగోలు, 10 వేల మంది సిబ్బంది నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేసింది.

పెండింగ్ డీఏలు, 11వ పీఆర్సీ బకాయిల చెల్లింపు, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని జేఏసీ కోరింది. జూన్ 11న ప్రభుత్వానికి వినతిపత్రం అందజేయడంతో పాటు జూన్ 16 నుంచి 20 వరకు సన్నాహక సదస్సులు, జూన్ 23, 24 తేదీల్లో డిపోలు, యూనిట్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

## ఆగస్టు నుంచి రైల్వే కొత్త రిజర్వేషన్ సిస్టమ్..

- ప్రయాణికులకు మరింత సులువుగా టికెట్లు!
- 40 ఏళ్ల పాత సిస్టమ్ ను మార్చనున్నట్లు వెల్లడి
- కొత్త వ్యవస్థతో వేగంగా టికెట్ల బుకింగ్
- 88 శాతం డిజిటల్ టికెట్లే కొంటున్న ప్రయాణికులు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ రైల్వే శాఖ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. టికెట్ బుకింగ్ విధానంలో గత కొన్ని దశాబ్దాలుగా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. ఆగస్టు నుంచి సరికొత్త 'ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్' విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. దాదాపు 1986 నుంచి వాడుకలో ఉన్న పాత సాంకేతిక విధానాన్ని ఈ సరికొత్త వ్యవస్థతో పూర్తిగా మార్చేయనుంది.

### మరింత వేగంగా బుకింగ్స్

ఈ సరికొత్త అప్‌గ్రేడ్ వల్ల ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. దీనివల్ల నిమిషాల వ్యవధిలోనే లక్షలాది టికెట్లను ఎలాంటి సర్వర్ సమస్యలు లేకుండా బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త సిస్టమ్‌కు మారే ప్రక్రియపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సాంకేతిక మార్పుల సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగరాదని అధికారులను ఆదేశించారు.

### డిజిటల్ వైపు ప్రయాణికులు

రైల్వే శాఖ 2002 సంవత్సరంలో ఇంటర్నెట్ ఆధారిత టికెట్ బుకింగ్‌ను ప్రారంభించింది. అప్పటి నుంచి కౌంటర్ల కంటే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న మొత్తం రైల్వే టికెట్లలో దాదాపు 88 శాతం బుకింగ్స్ కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే జరుగుతున్నాయి. ఈ భారీ డిమాండ్‌కు అనుగుణంగానే పాత వ్యవస్థను అధునాతన సాంకేతికతతో రైల్వే మారుస్తోంది.

### 'రైల్ వన్' యాప్ రికార్డు

రైల్వే శాఖ డిజిటల్ విప్లవంలో భాగంగా గతేడాది జులైలో ప్రారంభించిన 'రైల్ వన్' యాప్ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం ఏడాది లోపే ఈ యాప్ 3.5 కోట్ల డౌన్‌లోడ్లను దాటేసింది. ఈ ఒక్క యాప్ ద్వారానే టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, రైలు లైవ్ స్టేటస్, ప్లాట్‌ఫామ్ సమాచారం, ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రస్తుతం ఈ యాప్ ద్వారా రోజూ సుమారు 9.29 లక్షల టికెట్లు బుక్ అవుతున్నాయని రైల్వే శాఖ వెల్లడించింది.

### ఏఐ వెయిటింగ్ లిస్ట్

కొత్త సిస్టమ్‌తో పాటు ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వెయిటింగ్ లిస్ట్ టూల్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోంది. మనం బుక్ చేసుకున్న వెయిటింగ్ లిస్ట్ టికెట్ కన్ఫర్మ్ అవుతుందా లేదా అనే అవకాశాలను ఈ టూల్ ముందుగానే అంచనా వేస్తుంది. దీని అంచనా కచ్చితత్వం గతంలో 53 శాతంగా ఉండగా.. ఇప్పుడు ఏకంగా 94 శాతానికి పెరిగింది. దీనివల్ల ప్రయాణికులు తమ ప్రయాణ ప్లాన్లను మరింత సులభంగా మార్చుకోవచ్చు.

## తెలంగాణలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌పై సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్ ):** తెలంగాణ రెవెన్యూ శాఖలో భారీ భూ దందాలు, అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణల నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. 2013-18 మధ్య హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన సమయంలో రాము నాయక్ పలు అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలన చేస్తుండగా ఈ లీలలు బయటపడ్డాయి. బహిరంగ మార్కెట్లో గజం రూ.2 లక్షలకు పైగా పలికే హైకోర్టు సమీపంలోని హౌసింగ్ బోర్డు స్థలాన్ని, గతంలో తొలగించబడిన వర్క్ ఇన్‌స్పెక్టర్ భార్య పేరిట 2018లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించారు. దీనికి సహకరించిన నాటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌పైనా విచారణకు ఆదేశించారు. విజయ్‌నగర్ కాలనీ, లక్ష్మిగూడ సహా పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలను అక్రమంగా బదిలీ చేసినట్లు రాము నాయక్‌పై 2017 నుంచి కేసులు ఉన్నాయి. ఈ దందాకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్‌ను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించగా, మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని మంత్రి హెచ్చరించారు.

## బీహార్ బస్సు ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం చంద్రబాబు

- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు
- తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు
- స్వల్ప గాయాల వారికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్ ):** బీహార్ రాష్ట్రంలో నెల్లూరు జిల్లా యాత్రికులతో ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు, గాయపడిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

ఈ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అదేవిధంగా తీవ్రంగా గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు, స్వల్ప గాయాలపాలైన వారికి ఒక్కొక్కరికి రూ. 1 లక్ష చొప్పున సహాయం అందించనున్నట్లు తెలిపారు.

ఈ నెల 1వ తేదీన నెల్లూరు జిల్లా నుంచి కాశీ యాత్రకు బయలుదేరిన ప్రైవేటు యాత్రికుల బస్సు బీహార్‌లో ప్రమాదానికి గురైంది. ఎదురుగా వచ్చిన లారీ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సంగం ప్రాంతానికి చెందిన ఇద్దరు, ఆత్మకూరుకు చెందిన ఒక మహిళ మృతి చెందినట్లు సమాచారం. మరో 15 మంది యాత్రికులు గాయపడగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఘటనపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితులకు అత్యవసర వైద్యసాయం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించడంతో పాటు, అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. గాయపడిన యాత్రికుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే ప్రత్యేక సహాయక బృందాలను ఏర్పాటుచేసి సమన్వయం చేయాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## క్రైస్తవ మత బోధకులు మల్లవరపు ప్రకాష్ మృతికి సీఎం చంద్రబాబు సంతాపం

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్ ):** విశాఖకు చెందిన క్రైస్తవ మత బోధకులు, విశ్రాంత ఆర్చ్ బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ మల్లవరపు ప్రకాష్ సమాజానికి చేసిన సేవలు ఎనలేనివని సీఎం వ్యాఖ్యానించారు. కడప, విజయవాడ, విశాఖపట్నంలో బిషప్ గా సుదీర్ఘకాలం పాటు ఆయన అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సీఎం పేర్కొన్నారు. ప్రకాష్ కుటుంబ సభ్యులకు, క్రైస్తవ మత పెద్దలకు వారి అనుచరులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రాజ్యసభ అభ్యర్థిగా సానా సతీష్ నామినేషన్ దాఖలు



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్ ):** తెలుగుదేశం పార్టీ తరపున రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా సానా సతీష్ సోమవారం అమరావతి అసెంబ్లీ భవనంలో నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణికి ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

నామినేషన్ కార్యక్రమంలో కూటమి పార్టీల నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. రాజ్యసభ అభ్యర్థిగా సానా సతీష్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రతిపాదకులుగా చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), తంగిరాల సౌమ్య సంతకాలు చేశారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం. అఖిల్ కుమార్, పి. విజయ కుమారితో పాటు కూటమి నేతలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), వరుపుల సత్యప్రభ, బండారు సత్యానందరావు పాల్గొన్నారు.

20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తదితర నాయకులు కూడా నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

## రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన ఎన్డీయే అభ్యర్థులకు అభినందనలు: పీవీఎన్ మాధవ్




**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసిన ఎన్డీయే అభ్యర్థులు సానా సతీష్ బాబు, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, లింగమనేని రమేష్‌లకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అభినందనలు తెలిపారు. ఎన్డీయే కూటమి తరపున ఎంపికైన అభ్యర్థులు తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారని పేర్కొన్నారు. రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలు, రాష్ట్ర అభివృద్ధి అవసరాలు, జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను సమర్థవంతంగా ప్రస్తావించి రాష్ట్రానికి మరింత మేలు చేకూర్చేందుకు కృషి చేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అభివృద్ధి, సుపరిపాలనకు కట్టుబడి ఉందని పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా రాజ్యసభ సభ్యులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.

ఎన్డీయే కూటమి ఐక్యత, సమన్వయానికి అభ్యర్థుల ఎంపిక నిదర్శనమని పేర్కొంటూ, నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల విజయాన్ని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా వారు సమర్థవంతంగా సేవలందించాలని కోరారు.

## ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక...!

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్ ):** భారతదేశం గర్వించే ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎమ్మెస్ సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా ఓ భారీ బయోపిక్ రాబోతున్న సంగతి తెలిసిందే. జాతీయ అవార్డు గ్రహీత, 'జెర్సీ' చిత్ర దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహిస్తున్నారు. అయితే, ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించేది ఎవరనే దానిపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడినట్లు తెలుస్తోంది. ఈ అరుదైన అవకాశం 'నేషనల్ క్రష్' రష్మిక మందన్నను వరించినట్లు సమాచారం.

ఫిల్మ్ నగర్ వర్గాల ప్రకారం, ఇటీవల చిత్రబృందం రష్మికపై రహస్యంగా ఒక లుక్ టెస్ట్ నిర్వహించింది. సాంప్రదాయ గెటప్‌లో రష్మిక అద్భుతంగా సరిపోయిందని, ఆమె హావభావాలు చూసి దర్శకుడు గౌతమ్ తిన్ననూరి పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని తెలుస్తోంది. దీంతో ఈ పాత్రకు ఆమెను దాదాపు ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467